




RNI - TELTEL/2023/87644

# నీలగిరి ఎక్స్‌ప్రెస్

తెలుగు దిన పత్రిక



**విలేకరులు కావలెను**

తెలంగాణ &ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రాలలో (నీలగిరి ఎక్స్ ప్రెస్): & చైతన్య గళం ఛానల్ లో పని చేయుటకు
- బ్యూరో ఇన్చార్జ్ లు- జిల్లా స్టాఫ్ రిపోర్టర్ లు -ఇన్చార్జ్ లు
- మండల రిపోర్టర్ లు
- క్రైమ్ రిపోర్టర్ లు
-జిల్లాల వారిగా ఆడ్ ఇన్చార్జ్ లు కావలెను. వివరాలకు మా WHATS APP నంబర్:- 9705770909 సంప్రదించండి.



సంచిక : 292 | సంపుటి : 3 | తెలంగాణ | ఆంధ్రప్రదేశ్ | సోమవారం | 09-02-2026 | పేజీలు-8 | వెల: రూ. 5.00


# మార్చి 31 నాటికి.. నక్సల్స్ రహిత దేశంగా భారత్

- కేంద్ర హోంమంత్రి అమిత్ షా వెల్లడి
- రాయ్‌పూర్‌లో అధికారులతో సమీక్ష



న్యూఢిల్లీ, ఫిబ్రవరి 8 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)

రానున్న మార్చి 31కల్లా భారత్ నక్సల్స్ రహిత దేశంగా మారబోతోందని కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా పునరుద్ఘాటించారు. మరికొద్ది వారాల్లో గడువు ముగియనుండడంతో నక్సల్స్ వ్యతిరేక ఆపరేషన్లపై ఛతతిస్ గఢ్ ప్రభుత్వం, అధికారులతో రాయ్‌పూర్‌లో ఆదివారం ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. భద్రతా బలగాలను ఏకం చేయడం, మౌలిక వసతుల విస్తరణ, మావోయిస్టుల ఆర్థిక నెట్‌వర్క్‌ను

-మిగతా 2 లో

# తెలంగాణలో'రహ-వీర్'!

- రోడ్డు ప్రమాదాల్లో ప్రాణాలు కాపాడితే రూ.25 వేల ప్రోత్సాహకం
- రాష్ట్ర రవాణాశాఖ శ్రీకారం




హైదరాబాద్/ ఫిబ్రవరి 8 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)

రోడ్డు ప్రమాదాల్లో ప్రాణనష్టాన్ని తగ్గించేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన 'రహ-వీర్' పథకాన్ని రాష్ట్రంలో సమర్థవంతంగా అమలు చేయనున్నట్లు రవాణా శాఖ వెల్లడించింది. ప్రమాదం జరిగిన వెంటనే భయపడకుండా ముందుకు వచ్చి బాధితుల ప్రాణాలను కాపాడిన సాధారణ పౌరులను (గుడ్ సమారిటన్స్) ఈ పథకం ద్వారా ప్రోత్సహించి గౌరవించనున్నట్లు ఆదివారం ఓ ప్రకటనలో పేర్కొంది. రోడ్డు ప్రమాద బాధితుల ప్రాణాలను కాపాడిన ప్రతి వ్యక్తిని 'రహ-వీర్'గా గుర్తించి, ఈ పథకం కింద రూ. 25,000 బహుమతితో పాటు

-మిగతా 2 లో



## సంఘ్ ఆదేశిస్తే తక్షణం పదవి నుంచి దిగిపోతా

- నాకు 75 ఏళ్లు నిండాయి.. అయినా పదవిలో కొనసాగాలని సంఘ్ చెప్పింది
- సావర్కర్‌కు భారతరత్న ఇవ్వాలి
- అప్పుడు ఆ పురస్కారానికే ప్రతిష్ఠ
- బంగ్లాలో హిందువులు ఐక్యంగా పోరాడాలి
- వివాదాల్లేని ఉమ్మడి పౌరస్మృతి అవసరం

ముంబై, ఫిబ్రవరి 8 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)

రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ ఆదేశిస్తే దిగిపోవడానికి సిద్ధమేనని ఆ సంస్థ చీఫ్ మోహన్ భాగవత్ స్పష్టం చేశారు. తనకు 75 ఏళ్లు పూర్తయ్యాయని, సాధారణంగా 75 ఏళ్లు దాటాక ఏ పదవిలోనూ లేకుండా పనిచేయాలంటారని, సంఘ్ ఆదేశిస్తే తప్పుకుంటానని చెప్పారు. అయితే తనను సంఘ్ కొనసాగాలని చెప్పిందన్నారు. ముంబైలో జరిగిన సంఘ్ శతాబ్ది ఉత్సవాల కార్యక్రమంలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. బీజేపీ-సంఘ్ పరివార్‌లో రిటైర్‌మెంట్‌పై చర్చ జరుగుతున్న సమయంలో భాగవత్ వ్యాఖ్యలకు ప్రాధాన్యత ఏర్పడింది.

**మెజారిటీ, మైనారిటీ లేదు.. అంతా ఒకటే**

అన్ని వర్గాలను పరిగణనలోకి తీసుకుని, ఎలాంటి వివాదాల్లేకుండా ఉమ్మడి పౌరస్మృతి రూపొందించాలని భాగవత్ అన్నారు.

-మిగతా 2 లో

# జిల్లాల మార్పు లేదు

## ఏదైనా అసెంబ్లీలో చర్చించిన తర్వాతే నిర్ణయం



- గత పాలకులు ఫోన్ ట్యాపింగ్‌తో వ్యాపారులను బ్లాక్‌మెయిల్ చేశారు
- అలాంటి పాపాత్ములను వదిలిపెట్టం
- సింగరేణి మెడికల్ అన్‌ఫిట్ బోర్డును రద్దు చేస్తాం :
- భూపాలపల్లి సభలో సీఎం రేవంత్ రెడ్డి

భూపాలపల్లి ఫిబ్రవరి 8 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)

ఉమ్మడి వరంగల్ జిల్లాకు, తెలంగాణ ఉద్యమానికి విడదీయలేని సంబంధం ఉందని, ఈ ప్రాంతం మేధావులకు, పోరాట యోధులకు పుట్టినిల్లని ముఖ్యమంత్రి ఎ. రేవంత్‌రెడ్డి కొనియాడారు. ఆదివారం గణపురం మండలం చెల్పూర్ గ్రామ పంచాయతీ పరిధిలో జరిగిన 'ప్రజాపాలన -- ప్రగతి బాట' బహిరంగ సభకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. ఈ సందర్భంగా జిల్లా అభివృద్ధి, సింగరేణి కార్మికుల సమస్యలు, గత ప్రభుత్వ వైఫల్యాలపై సీఎం ఘాటుగా స్పందించారు.

-మిగతా 2 లో




# కాంగ్రెస్, ఎంఐఎం 100కోట్ల డీల్

- కరీంనగర్‌లో బీజేపీని ఓడించేందుకు కుట్ర
- ఎన్ని కుట్రలు చేసినా బీజేపీ గెలుపు తథ్యం
- రావణుడికి, కౌరవులకు పట్టిన గతే మజ్లిస్‌కు
- మునిసిపల్ ఎన్నికల ప్రచారంలో బండి సంజయ్

హుస్నాబాద్,ఫిబ్రవరి 8 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)

ఫిబ్రవరి 8(ఆంధ్రజ్యోతి): కరీంనగర్ కార్పొరేషన్‌లో మునిసిపల్ ఎన్నికల్లో బీజేపీని ఓడించేందుకు కాంగ్రెస్, ఎంఐఎం పార్టీలు రూ.100 కోట్ల డీల్ కుదుర్చుకున్నాయని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్ ఆరోపించారు. ఇక్కడ బీజేపీ గెలుపు తథ్యమని తెలిసి, ఆ పార్టీలు తెరవెనుక కుట్రలు పన్నుతున్నాయని విమర్శించారు. మునిసిపల్ ఎన్నికల ప్రచారంలో భాగంగా కరీంనగర్, చొప్పదండి, సిద్దిపేట జిల్లా హుస్నాబాద్‌లలో ఆదివారం నిర్వహించిన సభల్లో ఆయన పాల్గొన్నారు. కరీంనగర్ సభలో బండి మాట్లాడుతూ.. ఇండియా పేరుతో బీజేపీ, పాకిస్థాన్ పేరుతో కాంగ్రెస్, ఎంఐఎం పార్టీలు కరీంనగర్‌లో కబడ్డీ ఆట

-మిగతా 2 లో



## మలేసియాలో త్వరలో యూపీఐ సేవలు..

- భారతీయులకు మేలు.. వెల్లడించిన మోదీ
- రక్షణ, వ్యాపారం, సహకారం,సెమీకండక్టర్ల సరఫరా వంటి అంశాల్లో ఇరు దేశాల మధ్య కీలక ఒప్పందాలు

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 8 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)

ఇండియాలో దూసుకుపోతున్న యూపీఐ సేవలు త్వరలో మలేసియాలో కూడా అందుబాటులోకి రానున్నాయి. ఈ విషయాన్ని భారత ప్రధాని నరేంద్ర మోదీ.. మలేసియా వేదికగా వెల్లడించారు. ప్రస్తుతం మలేసియాలో మోదీ పర్యటిస్తున్న సంగతి తెలిసిందే. ఈ సందర్భంగా ఆదివారం జరిగిన ఒక కార్యక్రమంలో మోదీ మాట్లాడారు. మలేసియాలో కూడా త్వరలోనే యూపీఐ సేవల్ని అందుబాటులోకి తెస్తామని ప్రకటించారు.అయితే, ఎప్పటినుంచి అందుబాటులోకి వచ్చేది వెల్లడించలేదు. ఈ సేవలు అక్కడ ఉంటున్న భారతీయులకు మేలు కలిగిస్తాయని మోదీ అన్నారు. మలేసియాలో రాబోయే యూపీఐ సేవలు వీపీఏ (వర్చువల్ పేమెంట్ అడ్రస్), లేదా క్యూఆర్ కోడ్,

-మిగతా 2 లో

# నేటితో ప్రచారం బంద్

- సాయంత్రంతో మున్సిపల్ ప్రచారం బంద్ క్యాంపెయిన్‌లో స్థానిక నేతలదే
- జోరు-పగలు ప్రచారాలు రాత్రి వ్యూహాలు
- పలు జిల్లాల్లో సీఎం రేవంత్ రెడ్డి, మంత్రులు, కేటీఆర్, హరీశ్ సభలు


హైదరాబాద్, ఫిబ్రవరి 8 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)

రాష్ట్రంలో మునిసిపల్ ఎన్నికల ప్రచారానికి సోమవారంతో తెరపడనుంది. సాయంత్రం ఐదు గంటల కల్లా మైకులు మూగబోనుండగా, ప్రచార రథాలు విశ్రాంతి తీసుకోనున్నాయి. రాష్ట్రంలో ప్రధానంగా.. ఏడు కార్పొరేషన్ల పరిధిలో 414 వార్డు డివిజన్లు, 116 మునిసిపాలిటీల్లోని 2,582 వార్డులు కలిపి మొత్తం 2,996 వార్డులకు ఎన్నికలు నిర్వహించనున్నారు ఈ ఎన్నికలకు సంబంధించిన ప్రచార పర్వం సోమవారం సాయంత్రం 5 గంటలకు ముగియనుంది. రాష్ట్రంలో 121 మునిసిపాలిటీలు, 10 కార్పొరేషన్లు ఉండగా వాటిల్లో 7 కార్పొరేషన్లు, 116 మునిసిపాలిటీల పరిధిలో మాత్రమే ప్రస్తుతం ఎన్నికలు జరగనున్నాయి. జీహెచ్‌ఎంసీ, గ్రేటర్‌వరంగల్, ఖమ్మం కార్పొరేషన్లు మినహా కరీంనగర్, రామగుండం, నిజామాబాద్, మహబూబ్‌నగర్, మంచిర్యాల,

-మిగతా 2 లో

# ఏప్రిల్‌లో కవిత 'జాగృతి పార్టీ'!

## గత నెలలో ఈసీకి దరఖాస్తు..




- ప్రక్రియలన్ని పూర్తిచేసుకొని ప్రారంభించేలా ఏర్పాట్లు
- జీహెచ్ఎంసీ బరిలో దిగాలని వ్యూహం..
- వచ్చే అసెంబ్లీ ఎన్నికలే లక్ష్యంగా అడుగులు

హైదరాబాద్,ఫిబ్రవరి 8 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)

తెలంగాణ జాగృతి సంస్థ త్వరలోనే రాజకీయ పార్టీగా అవతరించనుంది. అన్ని ప్రక్రియలు పూర్తిచేసుకొని.. వచ్చే ఏప్రిల్‌లో ప్రారంభానికి సిద్ధమవుతున్నట్లు తెలుస్తోంది. కొత్త పార్టీ ఏర్పాటు కోసం కేంద్ర ఎన్నికల సంఘానికి (ఈసీఐ) గత నెలలోనే జాగృతి ప్రతినిధులు దరఖాస్తు అందజేశారు. నిబంధనల ప్రకారం ఈసీఐకి అన్ని వివరాలు అందజేశారు. ఈసీఐ విధివిధానాలకు అనుగుణంగా అన్ని ప్రక్రియలు పూర్తయితే రెండు నెలల్లో జాగృతికి

-మిగతా 2 లో



## అమెరికా దాడికి దిగితే ప్రతీకార దాడులు తప్పవు

- ఆ దేశ సైనిక స్థావరాలపై విరుచుకుపడతాం: ఇరాన్

కైరో,

అమెరికా ఇరాన్‌పై దాడి చేస్తే పశ్చిమాసియాలోని ఆ దేశ సైనిక స్థావరాలపై విరుచుకుపడతామని ఇరాన్ హెచ్చరించింది. అయితే ఈ దాడులను అమెరికా సైన్యానికి ఆతిథ్యం ఇస్తున్న దేశాలపై దాడులుగా చూడకూడదని ఆ దేశ విదేశాంగ మంత్రి అబ్బాస్ అరాఛ్చీ అన్నారు. ఇరాన్ అణు కార్యక్రమం గురించి పరోక్ష చర్చలు కొనసాగించడానికి టెహ్రాన్, వాషింగ్టన్ అంగీకరించిన మరుసటి రోజే అరాఛ్చీ ఈ వ్యాఖ్యలు చేశారు. ఒమన్‌లో చర్చలు సానుకూలంగా జరిగాయని అంతకుముందు ఇరు పక్షాలు తెలిపాయి. అయితే తదుపరి చర్చల విషయమై తేదీ నిర్ణయించలేదని అరాఛ్చీ చెప్పగా.. వచ్చే వారం మొదట్లో చర్చలు జరగవచ్చని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ అన్నారు. ఇటు.. ఇరాన్‌లో పౌరుల తిరుగుబాటుకు 114 మంది నోబెల్ గ్రహీతల బృందం మద్దతు పలికింది. ఇరాన్ వ్యాప్తంగా మతాధికారుల నియంతృత్వం, క్రూరమైన అణచివేతను ఖండిస్తూ ఓ ప్రకటన విడుదల చేసింది. ఇదిలాఉండగా.. ప్రభుత్వానికి వ్యతిరేకంగా జైల్లో నిరాహార దీక్షకు దిగిన నోబెల్ శాంతి బహుమతి గ్రహీత నర్గీస్ మొహమ్మదీకి ఇరాన్ కోర్టు ఏడున్నరేళ్ల జైలు శిక్ష విధించింది.

# రేవంత్ నకిలీ.. కేసీఆర్ అస్లీ..

## నువ్వు డూప్లికేట్ సీఎం అని ప్రజలకు అర్థమైంది

- బరాబర్ అసలైన బీఆర్ఎస్‌నే గెలిపిస్తారు
- నకిలీ గాళ్లకు ప్రజలు కర్రుకాల్చివాత పెట్టడం ఖాయం
- గల్లీల్లో మోరీల కంటే రేవంత్ నోటి నుంచి ఎక్కువ కంపు
- బీఆర్ఎస్ వల్లే అజారుద్దీన్‌కు మంత్రి పదవి వచ్చింది
- ఉమ్మడి మెదక్‌లో ఎగిరేది గులాబీ పార్టీ జెండాయే
- మున్సిపోల్ ప్రచారంలో మాజీ మంత్రి హరీశ్‌రావు
- ఆరు మున్సిపాలిటీల్లో విస్తృత పర్యటన



2 లో

# మార్చి 31 నాటికి.. నక్సల్స్ రహిత దేశంగా భారత్

మొదటి తరువాయి

దెబ్బతీయడం, లొంగుబాటు పాలసీల వంటివి నక్సలిజంపై పోరాటంలో సత్ఫలితాలను ఇచ్చినట్లు చెప్పారు. ఈ సమావేశంలో ఛత్తీసగఢ్ ముఖ్యమంత్రి విష్ణుదేవ్ సాయి, ఉప ముఖ్యమంత్రి విజయ్ శర్మ, కేంద్ర హోం కార్యదర్శి, ఇంటెలిజెన్స్ బ్యూరో డైరెక్టర్, హోం వ్యవహారాల శాఖ స్పెషల్ సెక్రటరీ, సీఆర్‌పీఎఫ్, బీఎస్ఎఫ్, ఐటీబీపీ, ఎన్ఐఏ డైరెక్టర్ జనరల్, ఛత్తీసగఢ్, ఒడిశా, మహారాష్ట్ర, జార్ఖండ్, తెలంగాణ పోలీసు ఉన్నతాధికారులు తదితరులు పాల్గొన్నారు. కాగా విధ్వంసకర కమ్యూనిస్టు సిద్ధాంతం దేశానికి ఇక ఎంతమాత్రం అవసరం లేదని అమిత్ షా పేర్కొన్నారు. నక్సలైట్లు తమ ఆయుధాలను వీడాలని కోరారు. నవా రాయ్‌పూర్‌లో ఆదివారం నిర్వహించిన ఒక కాంక్లేవ్‌లో మాట్లాడుతూ ఈమేరకు పేర్కొన్నారు. కమ్యూనిస్టుల పాలన ఉన్నచోట అభివృద్ధి ఉండదన్నారు. ప్రజాస్వామ్యంలో ఆ సిద్ధాంతానికి కాలం చెల్లిందని, త్రిపుర, పశ్చిమ బెంగాల్‌లలో వారి పాలన ముగిసిందన్నారు. కేరళలో ఉన్నా అక్కడా తిరువనంతపురం నుంచి మార్పు మొదలైందని పేర్కొన్నారు.

# తెలంగాణలో‘రహ-వీర్’!

మొదటి తరువాయి

ప్రశంసా పత్రాన్ని అందజేయనున్నట్లు తెలిపింది. గుడ్ సమారిటన్లకు చట్టపరంగా పూర్తి రక్షణ ఉంటుందని, పోలీసు దర్యాప్తులు, కోర్టు విచారణల పేరుతో వేధింపులు ఉండవని రవాణా శాఖ స్పష్టం చేసింది. ప్రమాదానికి గురైన బాధితులకు ఆస్పత్రుల్లో ఎలాంటి




ఇబ్బందులు లేకుండా తక్షణ వైద్యసేవలు అందించాలని ఆదేశాలు జారీ చేసినట్లు తెలిపింది. పథకం అమలులో భాగంగా జిల్లా స్థాయిలో కమిటీలను ఏర్పాటు చేయడంతో పాటు విస్తృత ప్రచారం కల్పించాలని సర్క్యులర్ జారీ చేసింది. ఈ కమిటీలో జిల్లా కలెక్టర్ చైర్మన్ గా, ఎస్పీ, జిల్లా మెడికల్, హెల్త్ అధికారులు సభ్యులుగా, జిల్లా రవాణా శాఖ అధికారి కన్వీనర్‌గావ్యవహరిస్తారని పేర్కొంది. ప్రమాద సమయంలో సహాయం చేసిన వ్యక్తి వివరాలను సంబంధిత ఎస్‌హెచ్ఓ, ఆస్పత్రి అధికారులు నమోదు చేసి, పోలీసు అధికారి ద్వారా జిల్లా కమిటీకి సిఫార్సు చేస్తారు. కమిటీ ఆమోదం పొందిన అనంతరం అర్హులైన వ్యక్తులను ‘రహ-వీర్’గా ఎంపిక చేసి, వివరాలను రవాణా కమిషనర్‌కు పంపిస్తారు. అనంతరంనగదు బహుమతి అందజేస్తామని రవాణాశాఖ తెలిపింది. “రోడ్డు భద్రత-ప్రతి ఒక్కరి బాధ్యత”అనే సందేశంతో రహ-వీర్ పథకాన్ని ప్రజలందరూ వినియోగించుకోవాలని కోరింది.

# సంఘ్ ఆదేశిస్తే తక్షణం పదవి నుంచి దిగిపోతా

మొదటి తరువాయి

మెజార్టీ, మైనార్టీ లేదని, అంతా ఒకటే సమాజమన్నారు. ముస్లిం, క్రైస్తవ సమాజాలతో పరస్పర విశ్వాసం, స్నేహంతో చర్చలు సాగాలన్నారు. జనాభా అసంతులనకు మతమార్పిళ్లు, అక్రమ చొరబాట్లు, జననాల రేటు తగ్గడం కారణమని చెప్పారు. కనీసం ముగ్గురు పిల్లల్ని కనాలని, అయితే ఇది ఆయా కుటుంబాల ఇష్టాన్ని బట్టి ఉంటుందన్నారు. ప్రలోభాలతో పాటు బలవంతంగా మతం మారిన వారిని తిరిగి హిందూమతంలోకి తీసుకువచ్చేందుకు ఘర్ వాపసీ సరైన పరిష్కారమని చెప్పారు. దేశంలో ప్రస్తుతం కులాన్ని రాజకీయ, స్వార్థ ప్రయోజనాల కోసం వాడుకుంటున్నారని పేర్కొన్నారు. ఏ కులం వారైనా సంఘ్ చీఫ్ కావొచ్చని భాగవత్ స్పష్టం చేశారు. వందేళ్ల ఆర్ఎ?సఎస్ యువ సంస్థ అని చెబుతూ, కార్యకర్తల సగటు వయసు 28అని, 25కు తీసుకొచ్చేందుకు యత్నిస్తున్నామని చెప్పారు. దేశ ప్రయోజనాలకు భంగం వాటిల్లకుండా భారత్-అమెరికా వాణిజ్య ఒప్పందం కుదిరినట్లు భావిస్తున్నామన్నారు. బంగ్లాదేశ్‌లో 1.25కోట్ల మంది హిందువులు ఐకమత్యంతో పోరాడాలని సూచించారు. వీర్ సావర్కర్‌కు భారతరత్న ఇస్తే దాని ప్రతిష్ఠ పెరుగుతుందని భాగవత్ చెప్పారు. ఈ ప్రతిపాదనపై కాంగ్రెస్ మండిపడింది. సావర్కర్‌కు ఏ ప్రాతిపదికన భారతరత్న ఇవ్వాలని ప్రశ్నించింది.

# కాంగ్రెస్, ఎంఐఎం 100కోట్ల డీల్

మొదటి తరువాయి

మొదలుపెట్టాయని అన్నారు. ఇక్కడ బీజేపీ 50 సీట్లు గెలవటం ఖాయమని తెలిసి.. కాంగ్రెస్, ఎంఐఎం మ్యాచ్ ఫిక్సింగ్‌కు పాల్పడుతున్నాయని ఆరోపించారు. ఎవరెన్ని కుట్రలు చేసినా బీజేపీ గెలుపు ఖాయమని అన్నారు. రామాయణం, మహాభారతంలో రావణుడు, కౌరవులకు ఏ గతి పట్టిందో ఎంఐఎంకు కూడా అదే గతి పట్టించేదాకా విశ్రమించే ప్రసక్తే లేదని స్పష్టంచేశారు. ‘బండి సంజయ్ నన్నే ఎక్కువ ఇష్టపడతారని ఒవైసీ మాట్లాడుతున్నాడు. అరే ఒవైసీ... నీకు తెలుసా? బీజేపీ నేతలకు కుటుంబం కంటే దేశం, ధర్మమే ముఖ్యం.. దుష్ట శిక్షణ కోసం కొన్నిసార్లు ఇంటిని కూడా మర్చిపోతం. రామాయణంలో రాముడికి ఎప్పుడూ రావణుడే గుర్తొచ్చాడు కదా.. మహాభారతంలో పాండవులకు కౌరవులే గుర్తొచ్చారు కదా..! ఈ బండి సంజయ్‌కి కూడా ఒవైసీనే గుర్తుకొస్తున్నాడు. రామాయణం, మహాభారతంలో రావణుడు, కౌరవులకు ఏ గతి పట్టిందో ఎంఐఎంకు కూడా అదే గతి పట్టించేదాకా విశ్రమించే ప్రసక్తే లేదు’ అని హెచ్చరించారు. మునిసిపల్ ఎన్నికల్లో బీజేపీని గెలిపిస్తే కరీంనగర్‌కు రక్షణ కవచంగా ఉంటానని హామీ ఇచ్చారు. జెండాలను పక్కన పెట్టి బీజేపీని గెలిపించాలని కోరారు.

# మలేసియాలో త్వరలో యూపీఐ సేవలు..

మొదటి తరువాయి

లేదా మొబైల్ నెంబర్ ద్వారా అందుబాటులోకి వస్తాయి. బ్యాంక్ అకౌంట్లతో పని లేకుండా ఈ సేవల్ని వినియోగించుకోవచ్చు. టూ ఫ్యాక్టర్ అథెంటికేషన్ ద్వారా ఈ సేవలకు భద్రత ఉంటుంది. మరోవైపు దేశంలో యూపీఐ సేవలు దూసుకెళ్తున్నాయి. గత ఏడాది 640 మిలియన్ల ట్రాన్సాక్షన్స్ జరిగినట్లు గణాంకాలు వెల్లడించాయి. ప్రపంచవ్యాప్తంగా ఎక్కువ మంది వాడుతున్న వీసా కార్డ్ సేవల కంటే మన యూపీఐ సేవలే అధికం. ప్రపంచవ్యాప్తంగా అమలవుతున్న డిజిటల్ ట్రాన్సాక్షన్స్‌లో సగానికిపైగా ఇండియాలోనే జరుగుతున్నాయి. ఇక.. మోదీ రెండు రోజుల మలేసియా పర్యటనలో భాగంగా ఆ దేశంతో కీలక ఒప్పందాలు చేసుకున్నారు. రక్షణ, వ్యాపారం, సహకారం,సెమీకండక్టర్ల సరఫరా వంటి అంశాల్లో ఇరు దేశాల మధ్య కీలక ఒప్పందాలు కుదిరాయి. మరోవైపు వివాదాస్పద మత గురువు జాకీర్ నాయక్‌ను ఇండియాకు అప్పగించే అంశంపై కూడా ఒత్తిడి తెచ్చే అవకాశం ఉంది. ఇండియాకు చెందిన జాకీర్ నాయక్.. కొన్నేళ్లుగా మలేసియాలో ఉంటున్నాడు.

# జిల్లాల మార్పు లేదు

మొదటి తరువాయి

భూపాలపల్లి జిల్లాను రద్దు చేస్తారంటూ కొందరు కావాలనే తప్పుడు ప్రచారం చేస్తున్నారని సీఎం మండిపడ్డారు.రాష్ట్రంలో ఏ జిల్లాను తొలగించే ఆలోచన గానీ, కొత్త జిల్లాల ఏర్పాటు గానీ ప్రభుత్వ పరిశీలనలో లేదని అన్నారు. జిల్లాల పునర్విభ జనపై అందరి అభిప్రాయాలు సేకరించి, అసెంబ్లీలో చర్చించిన తర్వాతే నిర్ణయం తీసుకుంటామని అన్నారు. తాత్కాలిక రాజకీయ ప్రయోజనాల కోసం కుట్రలు చేసే వారిని గమనించాలని సూచించారు. భూపాలపల్లి జిల్లా ఎక్కడికీ పోదని స్పష్టం చేశారు. నల్లబంగారాన్ని వెలికితీస్తూ దేశానికే ఆదర్శంగా నిలుస్తున్న సింగరేణి కార్మికులకు ప్రభుత్వం అండగా ఉంటుందని సీఎం హామీ ఇచ్చారు. సింగరేణి కార్మికులకు భారంగా మారిన మెడికల్ అన్‌ఫిట్ బోర్డును రద్దు చేస్తామని ప్రకటించారు. గతంలో డిస్మిస్ అయిన 217 మంది కార్మికుల సమస్యను తప్పకుండా పరిష్కరిస్తామన్నారు. వారసత్వ ఉద్యోగాలపై జరుగుతున్న విష ప్రచారాన్ని నమ్మవద్దని, కార్మికుల సంక్షేమమే ఈ ప్రభుత్వ ధ్యేయమని తెలిపారు. గత పాలకులు డబుల్ బెడ్రూం ఇండ్ల పేరుతో పేదలను వంచించారని రేవంత్ రెడ్డి



విమర్శించారు. కేసీఆర్ కుటుంబ సభ్యులు ఫామ్‌హౌస్‌లు కట్టుకున్నారే తప్ప, పేదల ఇండ్ల గురించి పట్టించుకోలేదని మండిపడ్డారు. వచ్చే బడ్జెట్‌లో రెండో విడత ఇండ్లను కూడా మంజూరు చేస్తామని వెల్లడించారు. 2027లో రాబోయే గోదావరి పుష్కరాల నాటికి బాసర నుంచి భద్రాచలం వరకు ఉన్న తీర ప్రాంతాన్ని పర్యాటక హబ్‌గా మారుస్తామని సీఎం ప్రకటించారు. ఇందుకోసం రూ. 3 వేల నుంచి 4 వేల కోట్లు ఖర్చు చేస్తామన్నారు. జంపన్న వాగు నుంచి రామప్ప చెరువుకు నీళ్లు ఇచ్చే ప్రయత్నం చేస్తామని హామీ ఇచ్చారు.

### వందల కోట్లు దోచుకున్నారు

గత ప్రభుత్వం ఫోన్ ట్యాపింగ్‌తో భార్యాభర్తలు, జడ్జిలు, జర్నలిస్టులు, సినీ తారలను కూడా వదల్లేదని సీఎం ఆరోపించారు. వ్యాపారులను బ్లాక్‌మెయిల్ చేసి వందల కోట్లు దోచుకున్నారని, ఇలాంటి పాపాత్ములను వదిలిపెట్టే ప్రసక్తే లేదని హెచ్చరించారు. ఆడబిడ్డల ఆశీర్వాదం తమ ప్రభుత్వానికి ఎప్పుడూ ఉండాలని సీఎం కోరారు. ప్రతి ఏటా దసరా పండుగకు మీ తమ్ముడిగా ‘ఇందిరమ్మ చీర’ను సారెగా అందజేస్తామని తెలిపారు. అనంతరం మహిళా సంఘాలకు రూ. 205 కోట్ల బ్యాంకు లింకేజీ చెక్కులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మంత్రులు దుద్దిళ్ల శ్రీధర్ బాబు, పొంగులేటి శ్రీనివాస రెడ్డి, కొండా సురేఖ, ఎంపీ డాక్టర్ కడియం కావ్య, వివిధ కార్పొరేషన్ల చైర్మెన్లు ఐతా ప్రకాష్ రెడ్డి, సిరిసిల్ల రాజయ్య, రాజబాబు, రెహ్మాన్ తదితరులు పాల్గొన్నారు.

# ఏప్రిల్‌లో కవిత‘జాగృతి పార్టీ’!

మొదటి తరువాయి

రాజకీయ పార్టీగా గుర్తింపు దక్కే అవకాశం ఉంది. తనకు సెంటిమెంట్ ఎక్కువని.. పార్టీ ప్రకటనకు మంచి మూహూర్తం కోసం ఎదురు చూస్తున్నానని జాగృతి అధ్యక్షురాలు కవిత ఇటీవలే తెలిపారు. దీన్నిబట్టి ఏప్రిల్ చివరి వారంలో.. లేదా మే మొదటి వారంలో పార్టీ ప్రకటన, ప్రారంభ కార్యక్రమాలు ఉంటాయని జాగృతి వర్గాలు తెలిపాయి. బీఆర్ఎస్ పార్టీ నుంచి సస్పెండైన తర్వాత కవిత.. జాగృతి జనంబాట పేరిట ప్రజల్లోకి వెళ్లారు. తన ఎమ్మెల్సీ పదవికి కూడా రాజీనామా చేసి సొంత పార్టీ ఏర్పాటు దిశగా వేగంగా అడుగులు వేస్తున్నారు. ప్రజా సమస్యలేంటి? జనం కోసం ఏం చేయాలి? పార్టీ విధానాలను ఎలా రూపొందించాలి? అన్నదానిపై కవిత దృష్టిపెట్టారు. అందులో భాగంగా జాగృతి ఆధ్వర్యంలో 50 కమిటీలు వేసి వివిధ వర్గాల నుంచి సమాచారం, అభిప్రాయాలు తీసుకున్నారు. వచ్చే అసెంబ్లీ ఎన్నికల నాటికి జాగృతి రాజకీయ పార్టీగా ఎదుగుతుందని.. ఉద్యమ కారులు, అమరవీరుల కుటుంబాలంతా జాగృతిలో చేరాలని కవిత ఇటీవల విజ్ఞప్తిచేశారు. సకాలంలో గుర్తింపు దక్కితే.. జీహెచ్ఎంసీ ఎన్నికల బరిలో జాగృతి పార్టీ నిలిచే అవకాశం ఉందని సమాచారం. సామాజిక తెలంగాణే ధ్యేయంగా వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో జాగృతి పార్టీ పోటీ చేస్తుందని కవిత చెబుతున్నారు.తన రాజకీయ భవిష్యత్ కోసం పటిష్ఠమైన కార్యాచరణను రూపొందించుకుంటున్నారు. రాబోయే రోజుల్లో తన రాజకీయ వ్యూహం మరింత స్పష్టంగా ఉంటుందని, కొత్త పార్టీ ప్రకటనతో తెలంగాణ రాజకీయాల్లో కొత్త చర్చ మొదలవుతుందని కవిత చేసిన వ్యాఖ్యలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి. జాగృతి విధానాల రూపకల్పనలో ఎన్నికల వ్యూహకర్త ప్రశాంత్ కిశోర్ కీలకపాత్ర పోషించే అవకాశం ఉందని చర్చ జరుగుతోంది. త్వరలోనే సభ్యత్వ నమోదుకు కసరత్తు చేస్తున్నారు.

# రేవంత్ నకిలీ.. కేసీఆర్ అస్లీ..

- -నువ్వు డూప్లికేట్ సీఎం అని ప్రజలకు అర్థమైంది
- -బరాబర్ అసలైన బీఆర్ఎస్‌నే గెలిపిస్తారు
- -నకిలీ గాళ్లకు ప్రజలు కర్రుకాల్చివాత పెట్టడం ఖాయం
- -గల్లీల్లో మోరీల కంటే రేవంత్ నోటి నుంచి ఎక్కువ కంపు
- -బీఆర్ఎస్ వల్లే అజారుద్దీన్‌కు మంత్రి పదవి వచ్చింది
- -ఉమ్మడి మెదక్‌లో ఎగిరేది గులాబీ పార్టీ జెండాయే
- -మున్సిపోల్ ప్రచారంలో మాజీ మంత్రి హరీశ్‌రావు
- -ఆరు మున్సిపాలిటీల్లో విస్తృత పర్యటన



**సంగారెడ్డి,**
కేసీఆర్ అసలైన నాయకుడైతే, రేవంత్‌రెడ్డి డూప్లికేట్ నాయకుడని.. మున్సిపల్ ఎన్నికల్లో తెలంగాణ ప్రజలు బరాబర్ అసలైన బీఆర్ఎస్‌ను గెలిపించి, నకిలీగాళ్లకు కర్రుకాల్చి వాతపెడతారంటూ మాజీ మంత్రి, బీఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్‌లీడర్ హరీశ్‌రావు హెచ్చరించారు. రేవంత్‌రెడ్డి ఏనాడూ జై తెలంగాణ అనలేదని, తెలంగాణ కోసం ఎన్నడూ కొట్లాడలేదని స్పష్టం చేశారు. బీఆర్ఎస్ అధినేత, తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ నిజమైన నాయకుడిగా తెలంగాణ ప్రజల గుండెల్లో నిలిచిపోయారని పేర్కొన్నారు. కేసీఆర్ ప్రజలకు ఇచ్చిన అన్ని హామీలను నెరవేర్చారని గుర్తుచేశారు. రూ.2వేల పింఛన్, రూ.10వేల రైతుబంధు, కల్యాణలక్ష్మీ, కేసీఆర్ కిట్, రైతుబీమా, సాగునీరు, తాగునీరు ఇచ్చి చూపించారని వివరించారు. కానీ రేవంత్‌రెడ్డి రెండేండ్లలో ఏ ఒక్క హామీ నెరవేర్చకుండా ఎగ్గొట్టాడని.. మరి ఎవరు అసలో, ఎవరు నకిలీయో ప్రజలకు అర్థమైంది పేర్కొన్నారు. ఆదివారం సంగారెడ్డి జిల్లాలోని ఆరు పట్టణాల్లో నిర్వహించిన మున్సిపల్ ఎన్నికల ప్రచార సభల్లో పాల్గొని ప్రసంగించారు. సంగారెడ్డి సభలో ఆయన మాట్లాడుతూ ఉమ్మడి మెదక్ జిల్లాలోని మున్సిపాలిటీల్లో గులాబీ జెండా ఎగురడం ఖాయమని ధీమా వ్యక్తంచేశారు. కాంగ్రెస్ పార్టీని, రేవంత్‌రెడ్డిని ఉమ్మడి మెదక్ జిల్లా ప్రజలు ఎవ్వరూ నమ్మడం లేదని హరీశ్‌రావు పేర్కొన్నారు.

### బూతుల ముఖ్యమంత్రికి బుద్ధి చెప్పండి

రాష్ట్రంలోని అన్ని మున్సిపాలిటీల్లో రోడ్లు గుంతలమయమై ప్రజలు కష్టాలు పడుతుంటే రేవంత్‌రెడ్డి కండ్లకు మాత్రం గంతలు కట్టుకున్నారని హరీశ్‌రావు దుయ్యబట్టారు. సంగారెడ్డి, సదాశివపేట, జహీరాబాద్, కోహీర్, బచ్చుగూడ, ఇస్నాపూర్‌లో నిర్వహించిన మున్సిపల్ ఎన్నికల సమావేశంలో ఆయన ప్రసంగించారు. గల్లీల్లో వీధి దీపాలు మార్చడం లేదు కానీ రేవంత్‌రెడ్డి భాష మాత్రం వీధి రౌడీలా మారిందని మండిపడ్డారు. గల్లీల్లో మోరీల కంటే రేవంత్‌రెడ్డి నోటి నుంచి వచ్చే మురికి మాటలే ఎక్కువ కంపుకొడుతున్నాయని ఎద్దేవా చేశారు. మున్సిపాలిటీల్లో చెత్త కూడా తొలగించలేని చెత్త ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అని దుయ్యబట్టారు. ముఖ్యమంత్రికి ఉండాల్సిన పద్ధతి ఇదేనా? ఇంత వెకిలిగా ప్రవర్తించటాన్ని ఎవరైనా మెచ్చుకుంటారా అని ప్రశ్నించారు. బూతుల ముఖ్యమంత్రికి మున్సిపల్ ఎన్నికల్లో ప్రజలు ఓటుతో బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. అన్నంపెట్టే కేసీఆర్ కావాలా, సున్నం పెట్టే రేవంత్‌రెడ్డి కావాలో ప్రజలు తేల్చుకోవాలని విజ్ఞప్తి చేశారు. రేవంత్‌రెడ్డి పాలనలో పేదలకు స్కీములు బంద్ అయ్యాయని.. కాంగ్రెస్ నాయకుల స్కాములు మాత్రం ఫుల్లుగా నడుస్తున్నాయని విమర్శించారు. రేవంత్‌రెడ్డి పాలనలో పచ్చితనమే తప్ప ఎక్కడా పచ్చదనం కనిపించడం లేదని ధ్వజమెత్తారు. తండ్రి వయస్సు ఉన్న కేసీఆర్‌ను పట్టుకుని రేవంత్‌రెడ్డి కనీస గౌరవం లేకుండా మాట్లాడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కాంగ్రెస్‌కు ఓటు వేయకపోతే ఇంటి బిల్లులు రావు పర్మిషన్లు రావని కాంగ్రెస్ నాయకులు బెదిరించడంపై మండిపడ్డారు. ఓట్లు వేస్తేనే మున్సిపాలిటీలకు నిధులు ఇస్తామని రేవంత్‌రెడ్డి బ్లాక్‌మెయిల్ చేయడం దుర్మార్గం అని మండిపడ్డారు. మున్సిపాలిటీలకు కేంద్ర ఫైనాన్స్ కమిషన్ నుంచి నిధులు వస్తాయని అవి ఎవరి దయాదాక్షిణ్యాల మీద ఆధారపడి ఉండవని చెప్పారు. కాంగ్రెస్ బెదిరింపులకు ఎవరూ భయపడకుండా ప్రజలంతా బీఆర్ఎస్‌కు ఓటువేసి గెలిపించాలని పిలుపునిచ్చారు.

### అజారుద్దీన్ చాంబర్‌లో కేసీఆర్ ఫొటో పెట్టుకోవాలి

బీఆర్ఎస్ వల్లే అజారుద్దీన్‌కు మంత్రి పదవి దక్కిందని, అయితే ఇప్పుడు రేవంత్‌రెడ్డి ఆయనకు ఎమ్మెల్సీ పదవి ఇస్తాడో లేదో తెలియదని హరీశ్‌రావు పేర్కొన్నారు. కాంగ్రెస్ రెండేండ్ల పాలనలో మైనారిటీ మంత్రి లేదని ఇదే విషయాన్ని బీఆర్ఎస్ పదే పదే ప్రశ్నించడం వల్లే కాంగ్రెస్ ఆయనకు మంత్రి పదవి ఇచ్చిందని చెప్పారు. అందుకు అజారుద్దీన్ తన చాంబర్‌లో కేసీఆర్ ఫొటో పెట్టుకోవాలని సూచించారు. అజారుద్దీన్‌కు రేవంత్‌రెడ్డి ఎమ్మెల్సీ పదవికి ఇవ్వకపోతే మూడు నెలల్లో మంత్రి పదవి ఊడిపోతుందని తెలిపారు. బీఆర్ఎస్ సెక్యులర్ పార్టీ అని, కేసీఆర్ పాలనలో మైనారిటీల అభ్యున్నతికి పెద్ద ఎత్తున నిధులు కేటాయించినట్టు గుర్తుచేశారు. కేసీఆర్ పాలనలో మతఘర్షణలు చోటు చేసుకోలేదని, కానీ రేవంత్ సర్కార్ వచ్చాక 60 ఘర్షణలు జరిగినట్టు చెప్పారు. ఎంఐఎం పార్టీ మహారాష్ట్రలో బీజేపీతో, తెలంగాణలో కాంగ్రెస్‌తో అంటకాగుతున్నదని దుయ్యబట్టారు. మున్సిపల్ ఎన్నికల్లో బీజేపీ ఓటు వేయడం అంటే వృథాయేనని తెలిపారు. కార్యక్రమంలో ఎమ్మెల్యేలు చింతా ప్రభాకర్, మాణిక్‌రావు, పటాన్‌చెరు నియోజకవర్గ ఇన్‌చార్జి ఆదర్శ్‌రెడ్డి, రాష్ట్ర నాయకులు శివకుమార్, ఎంపీ హకీం, కాసాల బుచ్చిరెడ్డి, మామిళ్ల రాజేందర్, బీఆర్ఎస్ కౌన్సిలర్ అభ్యర్థులు పాల్గొన్నారు.

# నేటితో ప్రచారం బంద్

మొదటి తరువాయి

కొత్తగూడెం, నల్లగొండ కార్పొరేషన్లలో ఎన్నికలు చేపడుతున్నారు. 121 మునిసిపాలిటీల్లోని నకిరేకల్, సిద్ధిపేట, కొత్తూరు., జడ్చర్ల, అచ్చంపేట పురపాలికలకు ప్రస్తుతం ఎన్నికలు నిర్వహించడం లేదు. మిగిలిన 116 మునిసిపాలిటీలకు సంబంధించిన వార్డుస్థానాలకు ఎన్నికలు జరుగుతున్నాయి. ఈనెల 11న ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు పోలింగ్ జరగనుంది. 13న ఉదయం 8 గంటలకు ఓట్ల లెక్కింపు ప్రక్రియను ప్రారంభించి, అనంతరం ఫలితాలను వెల్లడించనున్నారు. పోలింగ్ ప్రక్రియ సజావుగా సాగేందుకు 16,031 బ్యాలెట్ బాక్సులను సిద్ధం చేయడంతోపాటు 8,203 పోలింగ్ కేంద్రాలను నిర్ణయించారు. ఎన్నికల సామగ్రి భద్రత కోసం 137 స్ట్రాంగ్ రూమ్‌లను, ఓట్ల లెక్కింపునకు 136 కౌంటింగ్ కేంద్రాలను సిద్ధం చేశారు.

# తెలంగాణ ఆత్మగౌరవ సభపై జేఏసీ ఆగ్రహం



**అమ్రాబాద్, జనవరి 8 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
తెలంగాణ ఉద్యమకారుల ఆత్మగౌరవ సభ పేరుతో జాగృతి పార్టీ నిర్వహణపై జేఏసీ తీవ్రంగా స్పందించింది. టీఎన్జీవో భవనంలో జరిగిన సమావేశంలో జేఏసీ నేతలు మాట్లాడుతూ, ఉద్యమకారులను పదేళ్లుగా గుర్తించని వారు ఇప్పుడు సభ పేరుతో మోసం చేస్తున్నారని విమర్శించారు. కల్వకుంట్ల కవిత విడుదల చేసిన వాల్ పోస్టర్లపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ, ఉద్యమకారుల పక్షాన నిలబడే హక్కు ఎవరికి లేదని పేర్కొన్నారు. జేఏసీ నేతలు మాట్లాడుతూ, తెలంగాణ రాష్ట్రం కోసం పోరాడిన మహనీయులు ప్రొఫెసర్ జయశంకర్, గద్దర్, కొండా లక్ష్మణ్ బాపూజీ, గాదె ఇన్నయ్య, జిట్ట బాలకృష్ణ, బెల్లి లలిత, మాలోజి వీరన్న, చెరుకు సుధాకర్, కేశవ్ జాదవ్, భయ్యాల జనార్ధన్ రావు, అందేశ్రీ, వరవరరావు వంటి మహనీయుల త్యాగాల ఫలితమే తెలంగాణ రాష్ట్రం అని గుర్తు చేశారు. కేసీఆర్‌ను జాతిపితగా, సోనియాను తెలంగాణ తల్లిగా పేర్కొనడం ప్రజలను మభ్యపెట్టడమేనని, తెలంగాణ రాష్ట్రం ఎవరో ఇచ్చింది కాదు, పోరాటంతో సాధించుకున్నదని స్పష్టం చేశారు. ఉద్యమకారులు నేడు నిర్లక్ష్యానికి గురై, అనేక మంది జీవనోపాధి లేక ఇబ్బందులు పడుతున్నారని, దీనికి పాలకులే బాధ్యులని జేఏసీ నేతలు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో టీజేఏసీ రాష్ట్ర నేత శ్రీనివాస్, తెలంగాణ జన సమితి విద్యార్థి సంఘం నాయకులు ఐనోలు వెంకటేష్, తులసి నాయక్, టిఆర్ఎస్వి నేత సుధాకర్ మల్లేష్ యాదవ్, గిరిజన యువజన సంఘం ఉపాధ్యక్షుడు శంకర్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

## ఓటుతో గెలిపించండి.. అభివృద్ధికి పట్టం కట్టండి

- ఏడవ వార్డు బిజెపి అభ్యర్థి నేనావత్ నిరంజన్ కుమార్



**ఆమనగల్లు, ఫిబ్రవరి 8(నీలగిరి ఎక్స్ ప్రెస్) :**
తనను ఓటేసి ఆశీర్వదించండి. అభివృద్ధికి బాటలు వేయండి. మీ వెంటే నేను ఉంటూ మంచి చెడుల్లో తోడుంటా అని ఏడవ వార్డు బిజెపి అభ్యర్థి నిరంజన్ కుమార్ ప్రచారాన్ని నిర్వహించారు. కమలం పువ్వు గుర్తుపై ఓటు వేసి తనను గెలిపించాలని ఓటర్లను అభ్యర్థిస్తున్నారు. ఆదివారం ఆయన ఏడవ వార్డులో ప్రచారం నిర్వహించారు. తనను నమ్మిన ప్రజలకు మోసం చేయనని ఇచ్చిన హామీలన్నీ తీరుస్తానని ఆయన అన్నారు. ఏడవ వార్డు నుంచి పోటీ చేస్తున్న తనను ఓటు వేసీ అధిక మెజారిటీతో గెలిపించాలన్నారు. అందరితో ఆప్యాయంగా ఉండే తనను కౌన్సిలర్ గా గెలిపించాలని కోరుతున్నాను. కార్యక్రమంలో విజయ్ కృష్ణ, రూపేష్, వెంకటేష్, సాయి,కాలనీవాసులు, తదితరులు పాల్గొన్నారు

## నిరంతరం ప్రజల్లోనే ఉంటా

- ఆమనగల్లు మున్సిపాలిటీ 15వ వార్డు బిజెపి అభ్యర్థి కం డే సీతారాములమ్మ



**ఆమనగల్లు, ఫిబ్రవరి 8(నీలగిరి ఎక్స్ ప్రెస్) :**
నిరంతరం ప్రజల్లో ఉంటూ అభివృద్ధికి పాటు పడతానని ఆమనగలు మున్సిపాలిటీ 15వ వార్డు బిజెపి అభ్యర్థి కండె సీతారాములమ్మ అన్నారు. ఈ మేరకు వారు ప్రచారంలో దూసుకుపోతుండగా, ప్రజలు బ్రహ్మరథం పడుతున్నారు. ఆదివారం బిజెపి పార్టీ నాయకులు కార్యకర్తలు కలిసి వార్డులో భారీ ర్యాలీ నిర్వహించి, ఇంటింటి చేపట్టారు. వార్డును అన్ని రంగాల్లో అభివృద్ధి పరిచి సుందరంగా తీర్చి దిద్దుతానన్నారు. ప్రజలు కమలం పువ్వు గుర్తుకు ఓటేసి తనను గెలిపించాలని కోరారు. వార్డులో అన్ని వర్గాల ప్రజల సంక్షేమానికి పాటు పడతానని తెలిపారు. అభివృద్ధి అంటే ఏంటో చేసి చూపుతానని ప్రజలు తనను గెలిపించాలని కండె సీతారాములమ్మ కోరారు. కార్యక్రమంలో కండె భాస్కర్, కండె సుమన్, గిరి, వడ్డే రాజు లక్ష్మణ్, రాజు, వెంకటేష్, యాదగిరి, టిల్లు యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

# కోరుకంటి చందర్ సమక్షంలో బీఆర్ఎస్ పార్టీలో భారీ చేరికలు



**పాలకుర్తి, ఫిబ్రవరి 8 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
పాలకుర్తి మండలంలో బహుజన సమాజ్ వాదీ పార్టీ మండల అధ్యక్షుడు నలిగంటి శ్యాం కుమార్, ఈశాల తక్కల్లపల్లి గ్రామానికి చెందిన డిష్ ఆపరేటర్ సంగెం రమేష్ ఆదివారం బీఆర్ఎస్ పార్టీలో చేరారు. గ్రామశాఖ అధ్యక్షుడు బండి శ్రీనివాస్ గౌడ్, మండల ప్రతినిధి ములుకాల కొమురయ్య ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో రామగుండం మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్ గులాబీ కండువా కప్పి వారిని పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా చందర్ మాట్లాడుతూ, కాంగ్రెస్ పార్టీ ఆరు గ్యారెంటీల పేరుతో ప్రజలను మోసం చేసిందని, ఇప్పటికే పంచాయతీ ఎన్నికల్లో ప్రజలు తగిన గుణపాఠం చెప్పారని అన్నారు. రాబోయే మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ డిపాజిట్ కోల్పోయే పరిస్థితులు కనిపిస్తున్నాయని పేర్కొన్నారు. కేసీఆర్ చేసిన అభివృద్ధి, సంక్షేమ పథకాల ప్రభావంతో ఇతర పార్టీలకు చెందిన నాయకులు, కార్యకర్తలు బీఆర్ఎస్ పార్టీలో చేరుతున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాలకుర్తి మండల కూరగాయల మార్కెట్ కమిటీ అధ్యక్షుడు బాదావత్ రాజేష్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

## ఆర్టీసీ బస్సు ఢీకొని ఒకరు మృతి



**యాచారం,ఫిబ్రవరి 08( నీలగిరి ఎక్స్‌ప్రెస్**
అతివేగంగా వచ్చిన బస్సు ఢీకొనడంతో ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటన ఆదివారం యాచారం పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. యాచారం మండలం దాత్ పల్లి పరిధిలోని వెంకటేశ్వరతండాకు చెందిన జటావత్ హరియా(47), మండల కేంద్రంలోని మొండి గౌరెల్లి చౌరస్తా దగ్గర ద్విచక్ర వాహనంపై యూటర్న్ తీసుకుంటుండగా.. ఎదురుగా అతివేగంగా వచ్చిన దేవరకొండ డిపోకు చెందిన బస్సు ఢీ కొట్టింది. దీంతో హరియా తీవ్ర గాయాలపాలయ్యాడు. చికిత్స కోసం 108 అంబులెన్సులో ఆసుపత్రికి తరలిస్తుండగా మృతి చెందాడు పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. యాచారంలో స్టాపు లేదని దేవరకొండ డిపోకు చెందిన బస్సు డ్రైవర్లు నిర్లక్ష్యంగా అతివేగంగా నడుపుతున్నారని దాని ఫలితంగానే ఈ ఘటన చోటు చేసుకుందని గ్రామస్తులు ఆందోళన చేపట్టారు.

## మున్సిపాలిటీ అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తా

- ఆమనగల్లు మున్సిపాలిటీ 9వ వార్డు కాంగ్రెస్ అభ్యర్థి గుర్రం కేశవులు
- అందరితో కలిసి పట్టణాన్ని ఉన్నతంగా తీర్చిదిద్దుతా
- ఎన్నికల్లో గెలిపించాలి



**ఆమనగల్లు, ఫిబ్రవరి 8(నీలగిరి ఎక్స్ ప్రెస్) :**
ఆమనగల్లు మున్సిపాలిటీని ప్రజల ఆకాంక్షల మేరకు అన్ని రంగాలు అభివృద్ధి చేస్తానని.. అభివృద్ధి తన లక్ష్యమని ప్రజలంతా తనకు ఓటు వేసి కౌన్సిలర్ గెలిపించాలని ఆమనగల్లు మున్సిపాలిటీ 9వ వార్డులో కాంగ్రెస్ అభ్యర్థి గుర్రం కేశవులు కోరారు. ప్రచారంలో భాగంగా కేశవులు వార్డు పరిధిలో గల ప్రతి ఓటరును కలుస్తూ వారి మద్దతు కోరుతున్నారు. చేతి గుర్తుకు ఓటు వేసి తనను గెలిపించాలని కోరుతున్నారు. ఆమనగల్లును ఉన్నత శుభ్రమైన మున్సిపాలిటీగా తీర్చిదిద్దేలా కృషి చేస్తానని చెప్పారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వమే ఉందని అదే పార్టీ నుంచి పోటీ చేస్తున్న తనను కౌన్సిల్దారుగా గెలిపిస్తే ప్రభుత్వా నిధులతో అభివృద్ధి చేస్తూ ప్రజల సమస్యలను పరిష్కరిస్తానని కేశవులు చెబుతున్నారు. కార్యక్రమంలో రహీం, ఖాదర్,కరీం,రమేష్ గాజుల, తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా అంబేద్కర్ విగ్రహస్థాపనకు శంకుస్థాపన



**అమ్రాబాద్, ఫిబ్రవరి 8 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
అమ్రాబాద్ మండలం కొత్తపల్లి గ్రామంలో నూతన అంబేద్కర్ విగ్రహం ఏర్పాటుకు భూమి పూజ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమాన్ని అంబేద్కర్ యువజన సంఘం గ్రామ అధ్యక్షుడు పురం ఆంజనేయులు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఎన్ఎస్‌యుఐ జిల్లా అధ్యక్షుడు సంతోష్, లడ్డు యాదవ్, కమిటీ సభ్యులు శ్యామ్, నాగార్జున్, అంజి, అంబేద్కర్ అభిమానులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

## అదుపుతప్పి ట్రాక్టర్ బోల్తా



**మంథని, ఫిబ్రవరి 8 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
మంథని నుంచి సిద్ధపల్లి వైపు సిమెంట్ బ్రిక్స్ లోడ్‌తో వెళ్తున్న ట్రాక్టర్ అదుపుతప్పి పొలంలో పడిపోయింది. ఈ ప్రమాద సమయంలో అదే మార్గంలో వెళ్తున్న టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దుద్దిళ్ల శ్రీను బాబు వెంటనే స్పందించారు. మంథని సీఐ రాజు తన సిబ్బందితో సమన్వయం చేసుకుని జెసిబిను తెప్పించి, ట్రాక్టర్ కింద ఇరుక్కున్న లేబర్‌ను క్షేమంగా బయటకు తీయడంలో కీలక పాత్ర పోషించారు. గాయపడిన వ్యక్తికి మెరుగైన వైద్యం అందేలా మంథని ప్రభుత్వ వైద్యశాల సూపరింటెండెంట్‌తో ఫోన్‌లో మాట్లాడి, అవసరమైన అన్ని వైద్య సదుపాయాలు కల్పించాలని దుద్దిళ్ల శ్రీను బాబు కోరారు.

## మంత్రి శ్రీధర్ బాబు సమక్షంలో కాంగ్రెస్‌లో చేరిన సీనియర్ నాయకులు



**మంథని, ఫిబ్రవరి 8 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
బీఆరెస్ పార్టీకి చెందిన సీనియర్ నాయకులు కాంగ్రెస్‌లో చేరారు. మాజీ ఎంపీపీ మదాడి శ్రీనివాస్ రెడ్డి, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ ఎక్కేటి అనంత రెడ్డి, రెడ్డి సంఘం మాజీ అధ్యక్షుడు ఎంఎస్ రెడ్డి, రామడుగు మారుతీ, రాదంటి శంకర్‌లు మంత్రి శ్రీధర్ బాబు సమక్షంలో కాంగ్రెస్ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించబడ్డారు. ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ, సీనియర్ నాయకులు కాంగ్రెస్‌లో చేరడం సంతోషకరమని, మంథని పట్టణం మరియు నియోజకవర్గ అభివృద్ధి కోసం వారి అనుభవం, సూచనలు ఉపయోగపడతాయని అన్నారు. పేద, బడుగు, బలహీన, మైనారిటీ వర్గాల అభివృద్ధి కోసం కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తుందని, రానున్న రోజుల్లో రాష్ట్ర పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలో పార్టీని బలోపేతం చేసే దిశగా ముందుకు వెళ్తామని తెలిపారు.

## అంబేద్కర్ విగ్రహానికి జ్ఞానమాల

-364 వారాలు పూర్తి



**బోడుప్పల్, ఫిబ్రవరి 8 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
గ్రేటర్ బోడుప్పల్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని అంబేద్కర్ విగ్రహానికి ఆదివారం 364వ జ్ఞానమాల సందర్భంగా అంబేద్కర్ ఆశయ సాధన సమితి సభ్యులు పూలమాలలు సమర్పించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న రాపోలు శ్రీరాములు మాట్లాడుతూ, నత్తి మైసయ్య ఆధ్వర్యంలో 364 వారాలు విజయవంతంగా పూర్తి కావడం ఎంతో సంతోషకరమని అన్నారు. గత ప్రభుత్వంలో నిరుపేద దళితులకు దళిత బంధు పథకం అందించగా, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం దానిని అమలు చేయడం లేదని విమర్శించారు. రానున్న మార్చిలో అయినా ఎస్సీ కార్పొరేషన్‌కు భారీగా నిధులు మంజూరు చేస్తే దళిత నిరుద్యోగ యువకులకు లబ్ధి చేకూరుతుందని అభిప్రాయం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో రాపోలు శ్రీరాములు, గురువుల యాకయ్య, బేక్కం శివ, కంచి సతీష్, జైబీమ్ అజయ్ స్వామి తదితరులు పాల్గొన్నారు.

# సాగర్ ఎడమ కాలువలో కారు దూసుకుపోయి దంపతుల మృతి



**మిర్యాలగూడ, ఫిబ్రవరి 8 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** మిర్యాలగూడ తాలూకాలో విషాదకర ఘటన చోటుచేసుకుంది. కంపసాగరం గ్రామానికి చెందిన తల్లం పుల్లయ్య, పద్మ దంపతులు శనివారం రాత్రి కారులో స్వగ్రామానికి వెళ్తుండగా కారు అదుపుతప్పి సాగర్ ఎడమ కాలువలో పడిపోయింది. ఈ ప్రమాదంలో భార్యాభర్తలు మృతి చెందారు.గత నెలలో ద్విచక్ర వాహనంపై ఇంటికి వెళ్తుండగా వెంకటాద్రిపాలెం గ్రామం వద్ద మంచు కురుస్తున్న సమయంలో గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో తీవ్ర గాయాలపాలైన వీరు స్థానిక ఆసుపత్రిలో చికిత్స పొందారు. నిన్న శనివారం సాయంత్రం కారులో స్వగ్రామానికి బయలుదేరిన సమయంలో ముకుందాపురం వద్ద కారు అదుపుతప్పి కాలువలో దూసుకుపోయింది. డ్రైవర్ బయటపడగా, దంపతులు దుర్మరణం పాలయ్యారు.కంపసాగరం గ్రామం రోదనలతో మునిగిపోయింది. మిర్యాలగూడలో కూడా వీరి బంధువులు, ఆప్తులు తీవ్ర విషాదంలో మునిగిపోయారు. మృతులు తల్లం పుల్లయ్య--పద్మలకు ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. ఒక కుమారుడు మిర్యాలగూడలో ఉంటుండగా, మరొకరు అమెరికాలో ఉన్నారు. ఆర్యవైశ్య సమాజంలో ఆదర్శ దంపతులుగా పేరుగాంచిన వీరి మరణం తీరని లోటు. ఈ ఘటన ఆర్యవైశ్యులందరిని దిగ్భ్రాంతికి గురి చేసింది.


# 14వ వార్డులో శారద బ్రహ్మం ఇంటింటి ప్రచారం



**వనపర్తి ఫిబ్రవరి 08( నీలగిరి ఎక్స్ ప్రెస్ ):** వనపర్తి మునిసిపాలిటీ ఎన్నికల ప్రచారంలో భాగంగా 14వ వార్డు కాంగ్రెస్ అభ్యర్థి శారద బ్రహ్మం ఇంటింటి ప్రచారంలో ముందంజలో కొనసాగుతున్నారు. పద్ధతి ప్రకారం ప్రణాళికాబద్ధంగా ప్రతి ఓటరును కలిసి ప్రచారం నిర్వహిస్తున్నారు. ప్రచారంలో భాగంగా గతంలో తమ భర్త 14వ వార్డుకు చేసిన సేవలను ఓటర్లకు గుర్తు చేస్తూ, ఈసారి తనకు అవకాశం ఇస్తే వనపర్తి ఎమ్మెల్యే మేఘారెడ్డి సహకారంతో పట్టణంలో 14వ వార్డును అభివృద్ధిలో ముందుకు తీసుకెళ్తానని వివరించారు. రోడ్లు, డ్రైనేజీ, తాగునీరు, పారిశుద్ధ్యం, వీధి దీపాలు వంటి మౌలిక వసతుల అభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తామని తెలిపారు. ప్రతి సమస్యను వార్డు స్థాయిలోనే పరిష్కరించే విధంగా పనిచేస్తానని ఓటర్లకు భరోసా ఇచ్చారు. వినమ్రతతో, ఆత్మీయంగా ఓటర్లను పలకరిస్తూ అభిప్రాయాలు తెలుసుకుంటూ ప్రచారం సాగించడం ప్రజలను ఆకట్టుకుంటోందని స్థానికులు పేర్కొన్నారు. మహిళలు, వృద్ధులు, యువత నుంచి ప్రచారానికి సానుకూల స్పందన లభిస్తున్నట్లు సమాచారం. 14వ వార్డులో అభివృద్ధి, సంక్షేమమే లక్ష్యంగా సాగుతున్న ఈ ప్రచారం మరింత ఉత్సాహంగా కొనసాగుతోందని పార్టీ వర్గాలు తెలిపాయి.

# ప్రజాసేవ చేసేందుకే రాజకీయాల్లోకి..


- ఆమనగల్లు మున్సిపాలిటీ ఐదవ వార్డు బిఆర్ఎస్ అభ్యర్థి పాపిశెట్టి రామకృష్ణ



**ఆమనగల్లు, ఫిబ్రవరి 8(నీలగిరి ఎక్స్ ప్రెస్) :** ప్రజాసేవ చేసేందుకే రాజకీయాల్లోకి వచ్చానని ప్రజలు నిండు మనసుతో బీ ఆర్ఎస్ కి పట్టం కడితే అభివృద్ధి చేస్తామని ఆమనగల్లు 5వ వార్డు బీఆర్ఎస్ అభ్యర్థి పాపిశెట్టి రామకృష్ణ తెలిపారు. ఆదివారం ఆయన ఐదవ వార్డులోని పలు కాలనీలో పార్టీ నాయకులతో కలిసి, ఇంటింటికి తిరిగి జోరుగా ప్రచారం చేశారు. ఆయన మాట్లాడుతూ.. ఐదవ వార్డు ప్రజల బలం మద్దతుతో ఎన్నికల్లో పోటీ చేస్తున్నట్లు తెలిపారు. బీఆర్ఎస్ తోని అభివృద్ధి, సంక్షేమం సాధ్యమన్నారు. కారు గుర్తుకు ఓటు వేసి ఆశీర్వదించాలని అభ్యర్థించారు. వార్డులో సిసి రోడ్లు, వీధిలైట్లు, అండర్ డ్రైనేజీ ఇతర అభివృద్ధి పనులు చేస్తానన్నారు. ఎన్నికల్లో గెలిపిస్తే ప్రజలకు అందుబాటులో ఉండి ప్రజాసేవ చేస్తానని చెప్పారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు,మహిళలు, యువకులు, వార్డు ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# గంగారం రోడ్డును పార్కు స్థలాన్ని కబ్జా చేసిన రైతు

-- పోలీసుల జోక్యం





**మహేశ్వరం, ఫిబ్రవరి 8 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** రంగారెడ్డి జిల్లా మహేశ్వరం మండలం గంగారం గ్రామపంచాయతీ పరిధిలో రోడ్డును, పార్కు స్థలాన్ని కబ్జా చేసిన ఘటన కలకలం రేపింది. మైలర్‌బాయ్ తండాలోని డిటిసిపి వెంచర్‌లో గంగారం తండాకు చెందిన రైతు మానవత్ పూర్యా కుటుంబ సభ్యులు రోడ్డును, పార్కు స్థలాన్ని దున్ని వరి నాటు నాటారు.ఈ విషయం తెలుసుకున్న గ్రామ సర్పంచ్ దేవేందర్ నాయక్ వారిని ప్రశ్నించగా, పొంతనలేని సమాధానం ఇచ్చారు. అనంతరం గ్రామపంచాయతీ పాలకవర్గంతో కలిసి మహేశ్వరం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. సీఐ వెంకటేశ్వర్లు రైతు పూర్యాను పిలిపించి విచారించారు. ఇకపై రోడ్డు, పార్కు స్థలానికి జోక్యం చేసుకోమని కుటుంబ సభ్యులతో ఒప్పంద పత్రం రాయించి సర్పంచ్‌కు అప్పగించారు. వరి నాటినందుకు నష్టపరిహారంగా రూ.10,000 కూడా చెల్లించారు.అయితే మరుసటి రోజు ఉదయం సర్పంచ్ దేవేందర్ నాయక్ రోడ్డు కోసం మట్టి పోయించి లెవెల్ చేస్తున్న సమయంలో పూర్యా కుటుంబ సభ్యులు కట్టెలు, గొడ్డళ్లతో దాడి చేయడానికి యత్నించారు. జెసిపి డ్రైవర్‌పై కూడా గొడ్డలి తో దాడి చేయడానికి ప్రయత్నించడంతో అతను అక్కడి నుండి వెళ్లిపోయాడు.సర్పంచ్ దేవేందర్ నాయక్ మాట్లాడుతూ, పూర్యా కుటుంబంపై కఠిన చర్యలు తీసుకోవాలని మహేశ్వరం ఎమ్మార్వో అప్పలనాయుడు, సీఐ వెంకటేశ్వర్లు, పై అధికారులకు సమాచారం అందించామని తెలిపారు.

# అభివృద్ధిలో వార్డును అగ్రగామిక నిలుపుతా

- ఆమనగల్లు మున్సిపాలిటీ 12వ వార్డు బిజెపి అభ్యర్థి చుక్క అల్లాజీ గౌడ్



**ఆమనగల్లు, ఫిబ్రవరి 8(నీలగిరి ఎక్స్ ప్రెస్) :** తనను మున్సిపల్ కౌన్సిల్ కు పంపిస్తే వార్డును అన్ని విధాల అభివృద్ధి చేసి అగ్రగామిక నిలుపుతానని ఆమనగల్లు మున్సిపాలిటీ 12వ వార్డు బిజెపి అభ్యర్థి చుక్క అల్లాజిగౌడ్ అన్నారు. ఆదివారం మహిళలు, వార్డు ప్రజలు ఆయనకు మద్దతు ఇచ్చారు. తన ను కౌన్సిల్ కు పంపిస్తే ప్రజల నమ్మకాన్ని వమ్ము చేయకుండా అందుబాటులో ఉంటూ సమస్య ఏదైనా ముందుండి పరిష్కరిస్తానని ఆయన ప్రజలకు తెలిపారు. మొదటిసారి ఎన్నికల్లో పోటీ చేస్తున్నానని, మంచి మెజార్టీతో గెలిపిస్తారని విశ్వాసం ఉందన్నారు. ఇంటింటికి తాగునీరు, సీసీ రోడ్ల నిర్మాణం చేయడంతో పాటు, పారిశుద్ధ విషయంలో శ్రద్ధ చూపుతానని చెప్పారు. ఆయన ప్రచారానికి ప్రజల నుంచి ఆర్ఎస్ స్పందన లభిస్తుందటతో ఆయన గెలుపు ఖాయమని చెప్పారు. కార్యక్రమంలో గిరి, చె న్నయ్య, కుమార్, కాలనీవాసులు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

# రెడ్డి ఆత్మీయ సమ్మేళనం ఘనంగా నిర్వహణ

**వనపర్తిలో ఐక్యత, సేవా సంకల్పానికి నాంది**






**వనపర్తి, ఫిబ్రవరి 08 ( నీలగిరి ఎక్స్ ప్రెస్):** వనపర్తి జిల్లా కేంద్రంలోని రెడ్డి కళ్యాణమండపం, నాగవరం వద్దిరాంరెడ్డి కాలనీ లో రెడ్డి సేవా సమితి వనపర్తి జిల్లా ఆధ్వర్యంలో ఆదివారం రెడ్డి ఆత్మీయ సమ్మేళనం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి జిల్లాలోని వివిధ గ్రామాల నుంచి రెడ్డి సోదరులు పెద్ద సంఖ్యలో హాజరై ఐక్యతను చాటారు.ఈ సందర్భంగా ఇటీవల ఎన్నికైన రెడ్డి గ్రామ సర్పంచ్లకు ప్రశంస పత్రాలు అందజేసి ఘనంగా సన్మానించారు. అలాగే గో ఆధారిత వ్యవసాయాన్ని ప్రోత్సహిస్తూ ఆ రంగంలో విశేష కృషి చేస్తున్న రైతులకు రైతు రత్న పురస్కారాలు ప్రదానం చేశారు. ఇటీవల ప్రభుత్వ ఉద్యోగాలు సాధించిన యువతను, వివిధ ప్రైవేటు రంగాల్లో ప్రతిభ కనబరిస్తున్న యువకులను ప్రశంస పత్రాలు, శాలువాలతో సన్మానించారు. యువత విజయం సమాజానికి స్ఫూర్తినిస్తుందని వక్తలు పేర్కొన్నారు. అదేవిధంగా రెడ్డి సేవా సమితి నిర్వహిస్తున్న సేవా కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొంటున్న సభ్యులను, అలాగే సమితికి నిరంతరం ఆర్థిక సహాయం అందిస్తున్న దాతలను ప్రత్యేకంగా సన్మానించి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమానికి సభాధ్యక్షులుగా రెడ్డి సేవా సమితి అధ్యక్షులు తలకంటి నారాయణరెడ్డి వ్యవహరించారు. ఆయన మాట్లాడుతూ, రెడ్డి కమ్యూనిటీ ఐక్యత, సేవా భావనతో ముందుకు సాగాలని, విద్య, వ్యవసాయం, ఉపాధి రంగాల్లో సమాజం బలపడేలా సమితి కృషి చేస్తుందని తెలిపారు. సమ్మేళనం విజయవంతంగా జరగడంతో పాల్గొన్న ప్రతినిధులు, వనపర్తి జిల్లా రెడ్డి సోదరులు హర్షం వ్యక్తం చేశారు.

# చేతి గుర్తుకు ఓటేసి ఆశీర్వదించండి

-ఆమనగల్లు 15వ వార్డు కాంగ్రెస్ అభ్యర్థి అవ్వారి రేవతి



**ఆమనగల్లు, ఫిబ్రవరి 8(నీలగిరి ఎక్స్ ప్రెస్) :** కాంగ్రెస్తోనే అభివృద్ధి సాధ్యమని, చేతి గుర్తుకు ఓటు వేసి గెలిపిస్తే వార్డును అభివృద్ధి చేస్తూ ప్రభుత్వ సంక్షేమ ఫలాలు పేదలకు అందిస్తానని ఆమనగల్లు మున్సిపాలిటీ 15వ వార్డు అభ్యర్థి అవ్వారి రేవతి అన్నారు. ఆదివారం ఆయన మద్దతు దారులతో కలిసి వార్డులో ఇంటింటికి తిరిగి ప్రచారం నిర్వహించారు. మహిళలు, వార్డు ప్రజలు ఆమెకు మద్దతు పలికారు. ప్రజలే తనకు ముఖ్యమని వారికి ఎల్లవేళలా అందుబాటులో ఉండి వారి కష్టసుఖాల్లో పాలు పంచుకుంటానన్నారు. ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి ఆశీర్వదించి తనను వార్డుకు పంపారని తెలిపారు. అన్ని వర్గాల ప్రజలు తన మద్దతుగా ఉన్నారని చేతి గుర్తుపై ఓటేసి గెలిపించాలని ఆమె కోరారు. కార్యక్రమంలో శివలింగం,శేఖర్,భాస్కర్, గౌస్, శివ,ఆకాష్, తదితరులు పాల్గొన్నారు.

# ప్రశాంతంగా ముగిసిన వెంకటరెడ్డి తిరణాలు



**ప్యాపిలి ఫిబ్రవరి 08 ( నీలగిరి ఎక్స్ ప్రెస్):** రెండు రోజులుగా అత్యంత వైభవంగా జరుగుతున్న వెంకటరెడ్డి తిరణాలు ఆదివారంతో ప్రశాంతంగా ముగిసింది. ఆదివారం పట్టణ ప్రజలు వారి బంధువులతో స్వామివారిని దర్శించుకుని మొక్కులు చెల్లించారు. తిరుణాలలో యువతి,యువకులు, పట్టణ ప్రజలు ఉత్సాహంగా పాల్గొన్నారు. ప్యాపిలి ఎస్ఐ నాగార్జున ఆధ్వర్యంలో తిరుణాలలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీస్ వారు పటిష్ట బందోబస్తును నిర్వహించారు. వెంకటరెడ్డి తిరుణాల ప్రశాంతంగా ముగియడంలో కీలక పాత్ర వహించిన ప్యాపిలి పోలీసు వారికి కమిటీ సభ్యులు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

## భరోసా సేవా సంస్థ సమక్షంలో ఎన్‌సీసీ కేడిట్ అభిరామ్‌కు ఘన స్వాగతం



**కరీంనగర్ ,ఫిబ్రవరి 8 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
77వ గణతంత్ర దినోత్సవ వేడుకల్లో ఢిల్లీలో పాల్గొని తిరిగి స్వగ్రామానికి చేరుకున్న ఎన్‌సిసి కేడిట్ అక్కినపల్లి అభిరామ్‌కు ఆదివారం భరోసా సేవా సంస్థ ఘన స్వాగతం పలికింది.కమాన్ నుండి ఆయన గృహం వరకు జాతీయ జెండాలు పట్టుకుని, బాజా భజంత్రీలతో భారీ ర్యాలీగా తీసుకువచ్చారు.ఈ కార్యక్రమంలో ప్రముఖ సంగీత గురువు శర్మ, ఉమ్మడి జిల్లా ఆర్యవైశ్య సంఘం నాయకులు నగునూరి అశోక్, మాదూరి ప్రసాద్, వాసవి సేవా కేంద్రం డైరెక్టర్ నలుమాసు చంద్రశేఖర్, అభిరామ్ తల్లిదండ్రులు అక్కినపల్లి నాగరాజు--శివజ్యోతి, భరోసా సేవా సంస్థ సభ్యులు మల్యాల వేణుగోపాల్, నలుమాసు విజయప్రసాద్, తాటిపల్లి సతీష్ బాబు, కేశెట్టి లక్ష్మణ్ కుమార్, సిరిపురం మనోజ్ కుమార్, కుటుంబ సభ్యులు, అభిమానులు, చిన్నారులు పాల్గొన్నారు.

## పురపాలక ఎన్నికల ప్రచారంలో ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి



**ఇబ్రహీంపట్నం, ఫిబ్రవరి 8 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
మున్సిపల్ ఎన్నికల ప్రచారంలో ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి, శేఖర్ మామ గారు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు ప్రజలను ఉద్దేశించి మాట్లాడుతూ, అభివృద్ధి కార్యక్రమాలు, సంక్షేమ పథకాల గురించి వివరించారు. ప్రచారంలో పలువురు ప్రముఖ నాయకులు, పార్టీ కార్యకర్తలు కూడా పాల్గొని, ప్రజలను తమ అభ్యర్థులకు మద్దతు ఇవ్వాలని కోరారు.

## హుస్నాబాద్ సరిహద్దు ప్రాంతంలో పెద్ద పులి సంచారం

### అప్రమత్తంగా ఉండాలని ప్రజలకు సూచన



**హుస్నాబాద్ నియోజకవర్గం, ఫిబ్రవరి 8 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
హుస్నాబాద్ నియోజకవర్గంలోని సిద్దిపేట జిల్లా కోహెడ మండల సరిహద్దు ప్రాంతంలో పులి సంచారం కలకలం రేపుతోంది. ఇటీవల పులి దాడిలో పశువులు మృతి చెందడంతో స్థానిక రైతులు, గ్రామస్తులు ఆందోళన చెందుతున్నారు.ఈ పరిణామంపై రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ జిల్లా అధికారులు, అటవీ శాఖ అధికారులతో మాట్లాడారు. పులి దాడిలో చనిపోయిన పశువులకు త్వరలోనే ప్రభుత్వం తరపున నష్టపరిహారం చెల్లించేలా చర్యలు చేపడతామని ఆయన హామీ ఇచ్చారు. ప్రజలు, రైతులు అప్రమత్తంగా ఉండాలని, పులి సంచారం ఉన్న ప్రాంతాల్లో జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. అటవీ శాఖ అధికారులు కూడా గ్రామాల్లో పర్యటిస్తూ ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారు.ఈ ఘటనతో సరిహద్దు ప్రాంతాల్లో భయం నెలకొన్నప్పటికీ, ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకుంటుందని, ప్రజల భద్రతకు అన్ని ఏర్పాట్లు చేస్తుందని అధికారులు స్పష్టం చేశారు.

# పిల్లలతో బలమైన అనుబంధమే నిజమైన ఆస్తి





తల్లిదండ్రులుగా మనం పిల్లలకు ఆస్తులు, సంపదలు, భవనాలు, భూములు ఇవ్వాలని తపన పడుతుంటాం. కానీ పిల్లలకు ఇవ్వగలిగే అతిపెద్ద ఆస్తి బలమైన అనుబంధమని మైక్ బెర్రీ తన పుస్తకంలో స్పష్టంగా చెప్పారు. ఆయన అభిప్రాయం ప్రకారం పిల్లల ప్రవర్తనను సరిదిద్దడం కంటే వారి హృదయాన్ని గెలుచుకోవడం ముఖ్యమని తల్లిదండ్రులు గుర్తించాలి. పిల్లలు తప్పు చేసినప్పుడు వారిని దిద్దడం సహజం. కానీ దిద్దుబాటు ఫలప్రదం కావాలంటే ముందుగా తల్లిదండ్రులు--పిల్లల మధ్య అనుబంధం ఉండాలి. అనుబంధం లేని క్రమశిక్షణ తిరుగుబాటుకు దారితీస్తుంది. పిల్లలు తప్పు చేసినప్పటికీ తల్లిదండ్రుల దగ్గరకు పరుగెత్తుకొచ్చేంత సురక్షిత వాతావరణాన్ని సృష్టించడం అవసరం.పిల్లలతో మాట్లాడేటప్పుడు వినడమే ఒక ప్రేమ భాష. వారు చెప్పే చిన్న విషయాలను శ్రద్ధగా వింటేనే, రేపు ఎదురయ్యే పెద్ద సమస్యలను కూడా మనతో పంచుకుంటారు. పిల్లల ప్రవర్తన వెనుక ఉన్న కారణాన్ని తెలుసుకోవడం అత్యంత ముఖ్యం. మొండితనం వెనుక ఆకలి, భయం, నిరాశ లేదా ఒంటరితనం ఉండవచ్చు. తల్లిదండ్రులు ఈ సంకేతాలను అర్థం చేసుకుంటేనే పిల్లల మనసును తీర్చిదిద్దగలరు. తల్లిదండ్రులు తప్పు చేసినప్పుడు పిల్లలకు క్షమాపణ చెప్పడం వల్ల గౌరవం తగ్గదు, పైగా పెరుగుతుంది. ఇది వారికి బాధ్యతాయుతంగా ఉండటం నేర్పుతుంది. ఒక పరిపూర్ణమైన వ్యక్తి కంటే నిజాయితీ గల వ్యక్తిగా కనబడటం పిల్లల మనసులో విశ్వాసాన్ని పెంచుతుంది.క్రమశిక్షణ అంటే శిక్షించడం కాదు, నేర్పించడం. కరుణతో కూడిన క్రమశిక్షణ పిల్లల హృదయానికి చేరుతుంది. “నేను నిన్ను ప్రేమిస్తున్నాను, అందుకే ఈ సరిహద్దులు విధిస్తున్నాను” అనే సందేశం పిల్లలకు చేరితే వారు క్రమశిక్షణను అంగీకరిస్తారు.పిల్లలతో గడిపే సమయం పరిమాణం కంటే నాణ్యత ముఖ్యం. రోజూ 15 నిమిషాలు ఫోన్ పక్కన పెట్టి, వారి కళ్లలోకి చూస్తూ గడపడం వారసత్వ నిర్మాణంలో ఒక ఇటుక వంటిది. పిల్లలు మాటల కంటే చేతల ద్వారా ఎక్కువ నేర్చుకుంటారు. తల్లిదండ్రులు గౌరవప్రదంగా ఉంటే వారు గౌరవించడం నేర్చుకుంటారు. ప్రేమగా ఉంటే వారు ప్రేమించడం నేర్చుకుంటారు.భయంతో సాధించే విధేయత తాత్కాలికం. నమ్మకం మాత్రమే బంధాన్ని బలపరుస్తుంది. పిల్లలు కూడా ఒక వ్యక్తి అని గుర్తించడం అవసరం. వారిని వేరొకరితో పోల్చకుండా, వారి సహజత్వాన్ని గౌరవించినప్పుడే వారి ప్రతిభ వెలుగులోకి వస్తుంది.మైక్ బెర్రీ చెప్పినట్లుగా పిల్లల హృదయాన్ని గెలుచుకోవడం అంటే వారి భవిష్యత్తును సురక్షితం చేయడమే. ప్రేమతో, ఓపికతో పిల్లల మనసులను తీర్చిదిద్దితేనే గొప్ప వారసత్వాలను నిర్మించగలం.

**వ్యాసకర్త**
**చెరుకు జంగయ్య గౌడ్**



# పర్యావరణాన్ని నిర్లక్ష్యం చెయ్యొద్దు

**-శాసన మండలి చైర్మన్ గుత్త సుకేందర్ రెడ్డి**






**కడ్తాల్, ఫిబ్రవరి 8 ( నీలగిరి ఎక్స్ ప్రెస్) :**
పర్యావరణాన్ని మనం ఎంతగా నిర్లక్ష్యం చేస్తే దాని పర్యవసానాలు మానవ జాతి మనుగడకు అంత ప్రమాదకరంగా పరిణమిస్తాయని శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి అన్నారు. పాత వ్యవసాయ పద్ధతులను పరిరక్షించుకోవడం వల్ల భూసారం, మనుషుల ఆరోగ్య ప్రయోజనాలే కాకుండా పర్యావరణ పరిరక్షణ కూడా సాధ్యమవుతుందని, ఆ దిశగా ప్రజలు చైతన్యం పెంచుకోవాలని కోరారు.పశు సంపదను పెంచు కోలేకపోతే వచ్చే 5 ఏళ్లలో మన భూమి,మన వ్యవసాయం మనకు కాకుండా పోతాయని ఆయన హెచ్చరించారు. రంగారెడ్డి జిల్లా కడ్తాల్ మండలం అన్మాసుపల్లి లో ని ఎర్త్ సెంటర్ లో కౌన్సిల్ ఫర్ గ్రీన్ రెవల్యూషన్, భారత్ బీజ్ స్వరాజ్ మంచ్ సంయుక్తాధ్వర్యంలో మూడు రోజుల పాటు జరిగిన తెలంగాణ ద్వితీయ వార్షిక విత్తన పండుగ ముగింపు సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఆర్టీఐ మాజీ కమిషనర్ దిలీప్ రెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ ముగింపు సమావేశంలో జాతీయ జీవవైవిధ్య ప్రాధికార సంస్థ మాజీ అధ్యక్షుడు అచలేందర్ రెడ్డి, తదితర ముఖ్యులు పాల్గొన్నారు.

పద్మశ్రీ అవార్డు గ్రహీత చింతల వెంకట్ రెడ్డి మాట్లాడుతూ... దేశీ విత్తనాల గ్రేడింగ్ తో ప్రకృతి వ్యవసాయం లో కూడా అధిక దిగుబడి సాధించవచ్చున్నారు. నల్లగొండ మాజీ ఎమ్మెల్యే నంద్యాల నర్సింహారెడ్డి మాట్లాడుతూ... దేశీ విత్తనాలు దేశ సంపద అని, వాటి విస్తృత వినియోగానికి ప్రోత్సాహం ఇచ్చే రీతిలో ప్రణాళికా బద్ధమైన ప్రభుత్వ విధానాలు అవసరం అన్నారు. రైతు ప్రయోజనాలు, ప్రజా ప్రయోజనాలే లక్ష్యంగా ఈ విధానాలు రూపొందాలన్నారు. వ్యవసాయ అనుబంధ రంగాలకు తగిన ప్రాధాన్యత ఇస్తేనే ప్రకృతి వ్యవసాయ పద్ధతు ల వినియోగం పెరుగుతుందన్నారు. ప్రభుత్వ విధానాలలో మార్పు వచ్చినప్పుడే ప్రకృతి వ్యవసాయం సాధ్యమవుతుందని ఏపీ మాస్ వ్యవస్థాపకులు సీఎస్ రెడ్డి అన్నారు. రైతు ఉత్పత్తి దారుల సంఘాలకు ఈ ఉద్యమం లో కీలక పాత్ర ఉందన్నారు. దేశీ విత్తనాల తో పంట దిగుబడి తగ్గుతుందనేది కేవలం ఒక అపోహేనని , వాటి వినియోగం వల్ల భూమి, మనుషుల ఆరోగ్యానికి ఎంతో మేలు జరుగుతుందన్నారు. ప్రకృతి వ్యవసాయానికి అనుగుణమైన ప్రత్యామ్నాయ విత్తన వ్యవస్థ ను బలోపేతం చేయాలన్నారు. ప్రముఖ పర్యావరణ వేత్త దొంతి నర్సింహా రెడ్డి మాట్లాడుతూ... ప్రస్తుతం దేశంలో హైబ్రిడ్, దేశీ విత్తన వ్యవస్థల మధ్య సంఘర్షణ జరుగుతుందన్నారు. అనేక రాష్ట్రాల్లో కార్పొరేట్ ప్రయోజనాలతో కూడిన విత్తన వ్యవస్థను రైతులు సవాలు చేస్తూ ప్రకృతి వ్యవసాయ ప్రయత్నాలు చేస్తున్నారని తెలిపారు. కౌన్సిల్ ఫర్ గ్రీన్ రెవల్యూషన్ ప్రెసిడెంట్ లీలా లక్ష్మారెడ్డి మాట్లాడుతూ రైతులు, శాస్త్రవేత్తలు, విధాన నిర్ణేతలు, స్వచ్ఛంద సంస్థల సమన్వయ భాగస్వామ్యం తో విత్తన పండుగను విజయవంతంగా నిర్వహించామన్నారు. లక్ష్యం దిశగా ప్రయాణించాల్సిన దూరం ఇంకా చాలా ఉందని, మరింత స్పష్టమైన కార్యాచరణ ప్రణాళిక తో ముందుకు సాగుతామని ఆమె చెప్పారు.

## శ్రీ శైలానికి శివ స్వాములు ఏడు రోజుల పాటు అన్నదాన కార్యక్రమం.

**గూడూరు నీలకంఠేశ్వర స్వామి భక్త బృందం.**



**గూడూరు ఫిబ్రవరి 8 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
గూడూరు ఎస్ఐ శ్రీ రాజ కుల్లాయప్ప గారి సమక్షంలో శ్రీశైలంలో దాతల సహకారంతో ఏడు రోజులపాటు నిర్వహిస్తున్న అన్నదాన కార్యక్రమానికి బయలుదేరుతున్న శివ స్వాములు మరియు నీలకంఠేశ్వర భక్త బృందం ఆదివారం నాడు బయలుదేరి వెళ్లారు ఈ కార్యక్రమం గత 23 సంవత్స రాలుగా గూడూరు నగర పంచాయతీ పట్టణ దాతల, మరియు గ్రామ పెద్దలు శివ స్వాముల కుటుంబాల సహకారంతో నిర్వహిస్తున్నట్లు తెలిపారు మరియు వారికి ప్రత్యేక ధన్యవాదాలు తెలుపుకున్నట్లు , నిర్వాహకులు తెలిపారు మరియు శ్రీశైలం వచ్చేవాళ్లు గౌరీ సదన్ గంగా సదన్ ఎదురుగా ఉన్న బాల గణేష్ పార్క్ దగ్గరకు రాగలరని మనవి చేస్తున్నట్లు నీలకంటేశ్వర భక్త బృందం తెలిపారు.

## మైసిగండి మైసమ్మ అమ్మవారిని దర్శించుకున్న హైకోర్టు న్యాయమూర్తులు



**కడ్తాల్, ఫిబ్రవరి 8 ( నీలగిరి ఎక్స్ ప్రెస్ )**

రంగారెడ్డి జిల్లా కడ్తాల్ మండలం మైసిగండి మైసమ్మ అమ్మవారిని తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తులు వాకిటి రామకృష్ణారెడ్డి, ప్రవీణ్ కుమార్ దర్శించుకున్నారు. ఈ సందర్భంగా వారు అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. వారి వెంట మాజీ సర్పంచుల సంఘము రాష్ట్ర అధ్యక్షులు గూడూరు లక్ష్మీ నర్సింహా రెడ్డి ఉన్నారు.

## శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి కళ్యాణం

-భక్తి పరవశ్యం





**మహబూబాబాద్, ఫిబ్రవరి 8 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
జిల్లా కేంద్రంలోని శ్రీ ఉమా చంద్ర మౌళీశ్వర స్వామి దేవస్థానంలో స్వాతి నక్షత్రాన్ని పురస్కరించుకొని శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి వారి కళ్యాణం అంగరంగ వైభవంగా జరిగింది. వందలాది మంది భక్తులు కళ్యాణ మహోత్సవాన్ని దర్శించి తరించారు. ఆలయ ప్రాంగణమంతా భక్తి పరవశ్యంతో నిండిపోయింది.వేదపండితులు యుగంధర్ శర్మ మాట్లాడుతూ, “శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి కళ్యాణంలో పాల్గొన్న ప్రతి ఒక్కరికి సకల పాపాలు, గ్రహపీడలు, దుష్టశక్తుల నుండి విముక్తి లభిస్తుంది. శారీరక, మానసిక ప్రశాంతి కలుగుతుంది. కోపం, ప్రతీకార భావాలు తొలగి మోక్షం సమీపిస్తుంది. దర్శనం ద్వారా అష్ట ఐశ్వర్యాలు -- సంపద, కీర్తి, ఆయురారోగ్యం -- చేకూరుతాయి” అని తెలిపారు.ఈ సందర్భంగా భక్తులు స్వామివారి కళ్యాణాన్ని దర్శించి ఆనందభాష్పాలు పెట్టారు. ఆలయ ప్రాంగణం వేదఘోషలతో, మంగళవాయిద్యాలతో, భక్తుల జయజయధ్వానాలతో మార్మోగింది.

## సీఎం కప్ రాష్ట్రస్థాయి చదరంగ పోటీలకు ఎంపికైన పెద్దపల్లి క్రీడాకారులు



**పెద్దపల్లి, ఫిబ్రవరి 8 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
పెద్దపల్లి పట్టణంలోని గాయత్రీ విద్యానికేతన్ పాఠశాలలో జరిగిన సీఎం కప్ జిల్లాస్థాయి చదరంగం పోటీల్లో విద్యార్థులు ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయికి ఎంపికయ్యారు.బాలికల విభాగంలో సుల్తానాబాద్ పట్టణానికి చెందిన దాసోహం ఆరాధ్య ప్రథమ స్థానం సాధించగా, ద్వితీయ స్థానంలో చిప్ప విజ్ఞస నిలిచారు. బాలుర విభాగంలో మంగళపల్లి విద్యాధర్ ప్రథమ స్థానం, ముత్యాల వసుదేవ్ ద్వితీయ స్థానం సాధించారు. వీరు హైదరాబాదులో జరగనున్న రాష్ట్రస్థాయి సీఎం కప్ చదరంగ పోటీలకు ఎంపికైనట్లు డి.వై.ఎస్.ఓ అక్కపాక సురేష్ తెలిపారు.ఈ సందర్భంగా పెద్దపల్లి జిల్లా చెస్ అసోసియేషన్ అధ్యక్షుడు గడ్డల శ్రీనివాస్ మాట్లాడుతూ, “చదరంగం ఆడటం వల్ల విద్యార్థుల్లో మేధాశక్తి పెరుగుతుంది. సెల్‌ఫోన్లకు ఆకర్షితులు కాకుండా, ఆలోచనాత్మకంగా ముందుకు సాగుతారు. క్రీడల్లో రాణించాలని ఆశిస్తున్నాం” అని విజేతలను అభినందించారు.ఈ కార్యక్రమంలో డి.వై.ఎస్.ఓ అక్కపాక సురేష్, జిల్లా చెస్ అసోసియేషన్ అధ్యక్షుడు గడ్డల శ్రీనివాస్, ఉపాధ్యక్షుడు బొబ్బిలి శ్యామ్, ఓదెల మండల అధ్యక్షుడు ముత్యాల నాగరాజు, చెస్ అకాడమీ ఆర్గనైజ్ సెక్రటరీ కే.యం. సూరజ్ బాన్ సింగ్ పాల్గొన్నారు.

# ప్రజల పక్షాన పోరాడే బిజిలి లింగయ్య బండి జ్యోతి లను గెలిపించండి.


సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు నారీ ఐలయ్య .



**దేవరకొండ ఫిబ్రవరి 08. (నీలగిరి ఎక్స్ ప్రెస్).**
కష్టజీవుల హక్కుల కోసం పోరాడే సిపిఎం అభ్యర్థులను గెలిపించాలని సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు నారి ఐలయ్య కోరారు.
శనివారం రోజున దేవరకొండ మున్సిపాలిటీ పరిధిలోని ఎనిమిదో వార్డు సిపిఎం అభ్యర్థి బిజిలీ లింగయ్య 18 వ వార్డు అభ్యర్థి బండి జ్యోతి గెలిపించాలని ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్మికులు రైతులు కూలీల హక్కుల కోసం నిరంతరం పోరాడుతున్న సిపిఎం మీ అభ్యర్థులను గెలిపించాలని ముఖ్యంగా ప్రజలపై ప్రభుత్వాలు మోపుతున్న భారాలను నిరసిస్తూ అనేక ఉద్యమాల కు నాయకత్వం వహించి ప్రజలు తరపున మరింత ఉద్యమాలు నిర్వహించడం కోసం మునిసిపాలిటీలో కి సిపిఎం అభ్యర్థులు కౌన్సిలర్లుగా అడుగుపెడితే దేవరకొండ పట్టణములోని ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై పోరాడుతారని తెలియజేశారు
కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం కార్పొరేట్ శక్తులకు అడ్డగోలుగా దోచు పెట్టే విధంగా వ్యవహరిస్తూ ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటుపరం చేస్తూ దేశ సంపదను కార్పొరేట్ శక్తులకు విదేశీ పెట్టుబడదారులకు అప్పగించే విధంగా వ్యవరిస్తున్నారని విమర్శించారు
ప్రజల కోసం నిరంతరం పనిచేసే వారిని గెలిపించాలని ఎన్నికల అప్పుడు వచ్చి డబ్బులు వెదజల్లే రాజకీయ నాయకులకు తగిన బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు.
ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యుడు కంబాలపల్లి ఆనంద్ ,మండల కార్యదర్శి నల్ల వెంకటయ్య, సిపిఎం కౌన్సిలర్ అభ్యర్థులు బిజెపి లింగయ్య బండి జ్యోతి.సిపిఎం నాయకులు ఓ యాదగిరి ,పర్వత రెడ్డి, కావలి కృష్ణయ్య ,వెంకటేష్, తదితరులు పాల్గొన్నారు.

## ఆనంద నిలయంలో పదవ తరగతి విద్యార్థులకు ప్రేరణాత్మక శిక్షణ తరగతులు




- ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎఎస్సిడిఓ శ్రీమతి కె.లత
- ఒత్తిడిని అధిగమించి 100% ఫలితాలు సాధించాలి... ఎఎస్సిడిఓ లత




**సూర్యాపేట,ఫిబ్రవరి 8(నీలగిరి ఎక్స్ ప్రెస్)**
సూర్యాపేట డివిజన్ పరిధిలోని పదవ తరగతి విద్యార్థుల కోసం ఆదివారం ప్రత్యేక శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. సూర్యాపేట ఏఎస్డీఓ పరిధిలో ఆనంద నిలయము వసతి గృహంలో జరిగిన ఈ కార్యక్రమం విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసాన్ని పెంచే దిశగా సాగింది. ఈ శిక్షణ తరగతులకు ఏఎస్‌సీడీఓ (ఎఫ్ ఎ సి) సూపరింటెండెంట్ శ్రీమతి కె.లత ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ రానున్న పదవ తరగతి పరీక్షలను భయపడకుండా, ఒత్తిడిని అధిగమించి ప్రశాంతంగా ఆలోచించి పరీక్షలు రాయాలని విద్యార్థిని, విద్యార్థులకు సూచించారు. కష్టపడి చదివి ఒక్క మార్కు కూడా వృథా కాకుండా సాధించాలనే లక్ష్యంతో ముందుకు సాగాలని ఆమె ప్రోత్సహించారు. పాల్గొన్నారు. శిక్షణ తరగతులు విద్యార్థుల్లో కొత్త ఉత్సాహాన్ని నింపాయని నిర్వాహకులు తెలిపారు. పదవ జిల్లాలోనే కాదు, రాష్ట్ర స్థాయిలో కూడా ఉత్తమ ఫలితాలు సాధించే స్థాయికి చేరాలని ఆకాంక్షించారు. విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకోవడం, సమయాన్ని సద్వినియోగం చేసుకోవడం, ఉపాధ్యాయులు ఇచ్చే సూచనలను పాటించడం చాలా అవసరమని తెలిపారు. చదువు అనేది కేవలం మార్కుల కోసం కాకుండా భవిష్యత్తు నిర్మాణానికి పునాది అని ఆమె అన్నారు. ఈ కార్యక్రమంలో వసతి గృహ సంక్షేమ అధికారులు, ఉపాధ్యాయులు, సిబ్బంది, వసతి గృహంలో ఉన్న విద్యార్థులు రానున్న పదవ తరగతి పరీక్షలలో విద్యార్థిని విద్యార్థులు ఒత్తిడిని అధిగమించి ఆలోచించి పరీక్షలు వ్రాయాలని, 100శాతం మార్కులు తగ్గకుండా చదువుకొని జిల్లాలో ముందంజలో ఉండాలని విద్యార్థులకు శ్రీమతి కె.లత సూచించారు. ఈ కార్యక్రమంలో వసతి గృహ సంక్షేమ అధికారులు కె.ఉప్పలయ్య, ఈ.ఇందిర, టి.భాస్కర్, ఆర్.నిర్మల, పి.వాణి జోష్న, ఏ.మహబూబ, పి.ముత్యాల రావు, ఎస్.కె.ఉస్మాన్, ఎస్.కమలాకర్, వై.నాగరాజు, డి.దేవదాసు, ఉపాధ్యాయులు వెంకన్న,(సైన్స్) గురుచరణ్,(ఇంగ్లీష్) సత్యనారాయణ (హిందీ) జగదీష్ (మ్యాథ్స్), ఎస్సిడిడి వసతి గృహ విద్యార్థిని విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# కూతురు వివాహం కోసం మేకల పెంపకం..

- అగ్నికి అహుతి అయినా మేకలు
- రంగారెడ్డి జిల్లా కడ్తాల్ మండలం ఏక్వాయిపల్లిలో మేకల షెడ్డుకు నిప్పు పెట్టిన గుర్తు తెలియని వ్యక్తులు
- అగ్నికి అహుతి అయినా 9 మేకలు
- కూతురు పెళ్లి ఖర్చులకోసం మేకలను అమ్ముదమన్న సమయంలోనే కలిబుడిదైనా మేకలు
- ప్రభుత్వం ఆదుకోవాలని వేడుకుంటున్న రైతు





**కడ్తాల్, ఫిబ్రవరి 8(నీలగిరి ఎక్స్ ప్రెస్**
కూతురు వివాహ ఖర్చుల కోసం ఓ వ్యక్తి మేకల పెంపకం చేపట్టాడు. కానీ ఇంతలోనే అ మేకల షెడ్డు అగ్నికి అహుతి అయినా ఘటన రంగారెడ్డి జిల్లా కడ్తాల్ మండలం ఏక్వాయిపల్లి గ్రామంలో చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన జోగు బాలయ్య మేకల పెంపకంతో జీవనం సాగిస్తున్నాడు. కూతురు వివాహ ఖర్చుల కోసం 10మేకలను పెంచుతున్నాడు. ఈ నిరుపేద రైతు వచ్చే నెలలలో కూతురు వివాహం చేసేందుకు ఉన్న మేకలను అమ్మడానికి పెట్టాడు. కానీ ఇంతలోనే మేకల షెడ్డుకు ఎవ్వరో గుర్తుతెలియని వ్యక్తి నిప్పు పెట్టడంతో 9మేకలు అగ్నికి అహుతి అయ్యాయి. ఒక మేక గాయలతో బయటపడింది. దీంతో బాధిత రైతు కుటుంబం కన్నీరుమున్నిరైంది. ప్రభుత్వ పరంగా ఆదుకోవాలని వేడుకుంటున్నారు.

# గుజరాత్‌లో యూరియా, డిటర్జెంట్‌తో పాలు

### ఫ్యాక్టరీపై అధికారుల దాడులు



**అహ్మదాబాద్ ఫిబ్రవరి 8 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
గుజరాత్‌లోని ఓ ఫ్యాక్టరీ దాదాపు ఐదేండ్లుగా కల్తీ (సింథటిక్) పాలను తయారు చూస్తూ అమ్ముకుంటున్నది. నిజమైన పాలకు బదులుగా రసాయన మిశ్రమాన్ని (యూరియా, డిటర్జెంట్) ఉపయోగించి రహస్యంగా సింథటిక్ పాలను తయారుచేస్తున్న సంగతి అధికారుల సోదాల్లో బయటపడింది.సబర్కాంత జిల్లాలోని ఓ ఫ్యాక్టరీపై ఆదివారం ఎఫ్ఎస్ఎస్ఏ అధికారులు జరిపిన దాడుల్లో ఈ సంగతి వెలుగుచూసింది. దీంతో ఈ ఫ్యాక్టరీ తయారుచేసిన కల్తీ పాలను వాడిన వినియోగదారుల నుంచి ఆందోళన వ్యక్తమవుతున్నది. తక్కువ మొత్తంలో నిజమైన పాలను వాడుతూ యూరియా, ప్రాసెస్ చేసిన పౌడర్‌లను కలుపుతున్నట్టు అధికారులు కనుగొన్నారు. రసాయానాలను, పౌడర్లను జోడించటం ద్వారా ప్రతిరోజూ దాదాపు 1,800 లీటర్ల కల్తీ పాలను ఉత్పత్తి చేశారని అధికారులు తెలిపారు.

## 45 ఏండ్ల తర్వాత

# నిందితుడి అరెస్ట్!



**ఖార్‌గోన్ ఫిబ్రవరి 8 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
ఒక వృద్ధుడు 45 ఏండ్ల క్రితం తాను చేసిన దొంగతనాన్ని మరచిపోయి సాధారణ జీవితం గడుపుతున్నాడు. అయితే చట్టం మాత్రం ఆ కేసును జ్ఞాపకం పెట్టుకొని తాజాగా అతడిని అరెస్ట్ చేసింది. పోలీస్ అధికారి శ్వేతా శుక్లా కథనం ప్రకారం.. సలీమ్, మరో ఆరుగురు కలిసి 1980లో బల్సాముంద్ కాకడ్ ప్రాంతంలోని పొలాల నుంచి రూ.100 విలువైన గోధుమలను దొంగిలించారు.ఆ తర్వాత సలీమ్ పక్కనే ఉన్న ధార్ జిల్లాలోని బాగ్ పట్టణానికి పారిపోయి అక్కడ ఒక కిరాణా దుకాణం నిర్వహిస్తూ సాధారణ జీవితం గడుపుతున్నాడు. సలీమ్‌పై వారెంట్ ఉండటంతో ఈ దొంగతనం కేసు కోర్టులో అలాగే పెండింగ్‌లో ఉంది. ఇటీవల మరో నిందితుడి కోసం సైబర్ విభాగం గాలిస్తుండగా సలీమ్ ఆచూకీ తెలిసింది.

# మానవ వ్యర్థాలతో క్యాన్సర్ ఔషధం!



**న్యూఢిల్లీ ఫిబ్రవరి 8 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
: క్యాన్సర్‌కు మానవ వ్యర్థాలతో ఔషధాన్ని కెనడా శాస్త్రవేత్తలు అభివృద్ధి చేశారు. వీటిని 'ఫెకాల్ కాప్సూల్స్' అని, శాస్త్రీయ భాషలో ఫెకాల్ మైక్రోబయోటా లేదా ఎఫ్ఎంటి అని పిలుస్తారు. ఆరోగ్యవంతుడైన మనిషి వ్యర్థాలను ఫ్రీజ్ చేసి, ఎండపెట్టి వాటిని ఎఫ్ఎంటి క్యాప్సూల్స్‌గా తయారు చేస్తారు. ఈ గోలీలు పొట్టలోకి చేరి మంచి సూక్ష్మజీవులను పెంపొందిస్తాయి.ఊపిరితిత్తుల క్యాన్సర్ విషయంలో సాధారణంగా వాడే ఔషధాలతో పోలిస్తే ఈ ఎఫ్ఎంటి గోలీలు 40-45 శాతం ఎక్కువ ప్రయోజనకరంగా పనిచేస్తాయి. వీటిని సాధారణ క్యాన్సర్ ఔషధాలతో కలిపి తీసుకొంటే 80 శాతం ఎక్కువ ప్రయోజనం కలుగుతుంది. చర్మ క్యాన్సర్ విషయానికి వస్తే ఎఫ్ఎంటి పిల్స్‌ను సాధారణ ఔషధాలతో కలిపి తీసుకొంటే 79 శాతం అధిక ప్రయోజనం చేకూరుతుంది.

## చంద్రుడిని ఢీ కొట్టనున్న గ్రహ శకలం!



**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 8 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
తాజా అధ్యయనం ప్రకారం ఒక భారీ గ్రహ శకలం 2032 సంవత్సరంలో చంద్రుడిని ఢీ కొట్టే అవకాశం ఉన్నట్టు తెలిసింది. 2024 వైఆర్4 అనే పేరు గల ఈ ఆస్టరాయిడ్ కాంతిని భూమి నుంచి స్పష్టంగా చూడొచ్చు. దీన్ని డిసెంబర్ 27, 2024న కనుగొన్నారు. మొదట ఇది భూమిని ఢీ కొట్టొచ్చని భయపడ్డారు. అయితే తాజా లెక్కల ప్రకారం ఇది చంద్రుడిని ఢీ కొట్టవచ్చు.డిసెంబర్ 22, 2032న ఇది చంద్రుడికి చాలా దగ్గరగా వెళ్లినప్పుడు చంద్రుడిని ఢీ కొట్టే అవకాశం 4.3 శాతం మేరకు ఉంది. ఇదే జరిగితే చిన్నపాటి అణు శక్తి విస్ఫోటనం జరిగినప్పుడు వెలువడేంత శక్తి వెలువడొచ్చు. దీని వల్ల చంద్రుడిపై కాంతివంతమైన మెరుపు ఏర్పడుతుంది. దీన్ని భూమి నుంచి సాధారణ టెలి స్కోప్‌తో వీక్షించవచ్చు.

# క్యాన్సర్ పరిశోధనలో కేరళ మరో ముందడుగు

### నేడు కొచ్చిన్ క్యాన్సర్ రీసెర్చ్ సెంటర్‌ను ప్రారంభించనున్న ముఖ్యమంత్రి పినరయి విజయన్

**కొచ్చి ఫిబ్రవరి 8 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
క్యాన్సర్ వ్యాధికి సంబంధించిన చికిత్స, పరిశోధన రంగంలో కేరళ మరో ముందడుగు వేసింది. ప్రపంచస్థాయి సౌకర్యాలతో నిర్మితమైన కొచ్చిన్ క్యాన్సర్ రీసెర్చ్ సెంటర్ (సిసిఆర్‌సి)ను కేరళ ముఖ్యమంత్రి పినరయి విజయన్ ప్రారంభించనున్నారు. ఈ నెల 9న సోమవారం మధ్యాహ్నం 3.00గంటలకు కలమస్సేరిలో ప్రారంభోత్సవ కార్యక్రమం జరగనుందని, ఈ కార్యక్రమానికి ఆరోగ్యమంత్రి వీణాజార్జ్, పరిశ్రమల మంత్రి పి.రాజీవ్ హాజరవుతారని అధికారులు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. సిసిఆర్‌సితో అత్యుత్తమ క్యాన్సర్ చికిత్స కేరళ ప్రజలకు అందుబాటులోకి రానుంది. రూ.449 కోట్ల వ్యయంతో నిర్మితమవుతున్న సిసిఆర్‌సి కేరళలో క్యాన్సర్ సంరక్షణకు అదనపు కేంద్రంగా




నిలవనుంది. ఇప్పటికే ప్రభుత్వ రంగంలో రెండు ప్రధాన క్యాన్సర్ సంరక్షణ సంస్థలైన తిరువనంతపురంలోని ఆర్‌సిసి, తలస్సేరిలోని ఎంసిసిలు సేవలను అందిస్తున్నాయి. సిసిఆర్‌సి అధునాతన మరియు అధిక నాణ్యత గల క్యాన్సర్ సంరక్షణను అందిస్తుంది. ఇది కేరళ రాష్ట్రంలో అత్యుత్తమ క్యాన్సర్ చికిత్స మరియు పరిశోధనల్లో మైలురాయిగా నిలవనుంది. కలమస్సేరి మెడికల్ కాలేజీ క్యాంపస్‌లో 12.63 ఎకరాల్లో సిసిఆర్‌సిని అభివృద్ధి చేసినట్లు అధికారులు తెలిపారు. 12 ఆపరేషన్ థియేటర్‌లతో పాటు భవిష్యత్ రోబోటిక్ సర్జికల్ విధానాల కోసం ప్రత్యేకంగా మరో ఆపరేషన్ థియేటర్‌ను నిర్మించామని అన్నారు. సిసిఆర్‌సి క్యాన్సర్ పరిశోధనలకు కూడా ప్రాధాన్యత నివ్వనుందని, స్కానింగ్, ఎక్స్‌రే, రేడియేషన్ థెరపి మరియు ఇతర కీలక సేవలను ఎఐ సాంకేతికతతో అనుసంధానించబడినట్లు చెప్పారు. అలాగే ఇడిజిఇ సర్టిఫికేషన్ పొందిన మొట్టమొదటి ఆస్పత్రి ఇదే కానుందని అన్నారు. సిసిఆర్‌సికి సౌరశక్తితో విద్యుత్‌ను అందిస్తుండటంతో, 25శాతం కర్బన ఉద్గారాల విడుదలతో పర్యావరణ హితంగా నిలవనుందని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వ ఆకాంక్షలకు అనుగుణంగా 2050 నాటికి కర్బన ఉద్గారాల విడుదలను జీరో స్థాయికి చేరాల్చలని భావిస్తున్నట్లు తెలిపారు.

# కర్ణాటకలో కూలిన ప్రైవేట్ విమానం

### పైలట్లకు తీవ్ర గాయాలు



**విజయపుర ఫిబ్రవరి 8 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
రెడ్ బర్డ్ ఏవియేషన్‌కు చెందిన తేలికపాటి ప్రైవేట్ విమానం సాంకేతిక సమస్య కారణంగా ఆదివారం కర్ణాటకలో కూలిపోయింది. ఈ ఘటనలో కెప్టెన్, శిక్షణ పైలట్‌కు తీవ్ర గాయాలయ్యాయి. బాధితులను వెంటనే దగ్గర్లోని దవాఖానకు తరలించారు. విజయపుర జిల్లాలోని మంగళూరు గ్రామంలోని ఓ పొలంలోని నేలను విమానం ఢీ కొట్టింది.దీంతో దాని ముందు భాగం బాగా దెబ్బ తింది. విమానం కలబురగి నుంచి బెళగావి వెళుతుండగా ఇంజిన్‌లో సాంకేతిక సమస్య తలెత్తి హఠాత్తుగా ఈ దుర్ఘటన జరిగింది. ఈ ఘటనపై అధికారులు దర్యాప్తు ప్రారంభించారు.

# కాంగ్రెస్ ఎంపీతో పాక్ ఏజెంట్‌కు సంబంధాలు

### అస్సాం ముఖ్యమంత్రి హిమాంత ఆరోపణ



**గౌహతి ఫిబ్రవరి 8 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
కాంగ్రెస్ ఎంపీ గౌరవ్ గొగోరుకు, ఆయన భార్య ఎలిజబెత్ గొగోరుకు పాకిస్థాన్‌తో సంబంధాలు ఉన్నాయని అస్సాం ముఖ్యమంత్రి హిమంత బిశ్వశర్మ తీవ్ర ఆరోపణలు చేశారు. ప్రపంచ వేదికలపై భారత్‌ను విమర్శించే పాక్ జాతీయుడు అలీ తౌఖీర్ షేక్‌తో ఎలిజబెత్‌కు సంబంధాలు ఉన్నాయని తెలిపారు. ఆ ఏజెంట్ 2010-13 మధ్యకాలంలో 13 సార్లు భారత్‌కు వచ్చినట్లు ఆయన పేర్కొన్నారు. గౌహతిలో ఆదివారం జరిగిన మీడియా సమావేశంలో హిమాంత మాట్లాడుతూ ఈ వ్యాఖ్యలు చేశారు. 'పాకిస్థానీ ఏజెంట్ అలీతో గౌరవ్ గొగొరు, ఆయన భార్య, బ్రిటన్ పౌరురాలైన ఎలిజబెత్‌కు సన్నిహిత సంబంధాలు ఉన్నాయి. 2011లో ఆమె అమె రికా నుంచి పాకిస్థాన్‌కు వెళ్లారు. అక్కడ పాక్ సంస్థ ఆమెకు ఉద్యోగం ఇచ్చింది. ఆ తర్వాత భారత్‌కు బదిలీ చేసింది. ఆమె జీతాన్ని అలీ చెల్లించాడు. ఎలిజబెత్ భారత్‌లోని ఒక సంస్థలో పనిచేస్తూ దేశానికి సంబంధించిన సమాచారాన్ని సేకరించి పాకిస్థాన్‌కు చేరవేశారు. తొమ్మిది సార్లు పాక్‌కు వెళ్లారు' అంటూ తీవ్ర ఆరోపణలు గుప్పించారు. ఈ ఆరోపణలను గొగోరు తీవ్రంగా ఖండించారు. ఈ శతాబ్దంలోనే అత్యంత ఘోరమైన ప్రెస్ కాన్ఫరెన్స్‌గా ఆయన అభివర్ణించారు. సి-గ్రేడ్ సినిమా కంటే దారుణంగా ఉందన్నారు. అత్యంత బుద్ధిహీన మైన, బూటకపు పాయింట్లుగా కొట్టిపారేశారు.

## అమెరికా సైనిక మోహరింపులకు భయపడబోం : ఇరాన్

**టెహ్రాన్ ఫిబ్రవరి 8 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**



అమెరికాతో చర్చల్లో యురేనియం శుద్ధి విషయంలో వెనక్కి తగ్గేది లేదని ఇరాన్ తేల్చిచెప్పింది. అరేబియా సముద్రంలో అమెరికా మోహరింపులకు తాము భయపడేది లేదని స్పష్టంచేసింది. ఇరాన్ విదేశాంగ మంత్రి అగర్చీ ఎఫ్ఎఫ్‌పీ వార్తాసంస్థతో మాట్లాడుతూ ఈ వ్యాఖ్యలు చేశారు. 'యుద్ధం వచ్చినా యురేనియం శుద్ధి విషయంలో వెనక్కి తగ్గబోమని మేం ఎందుకు నొక్కి చెబుతున్నాం?ఎందుకంటే తమను ఆదేశించే హక్కు ఎవరికీ లేదు' అని ఆయన స్పష్టంచేశారు. అరేబియా సముద్రంలో యూఎస్ఎస్ అబ్రహం లింకన్ యుద్ధ నౌకను అమెరికా మోహరించడాన్ని ప్రస్తావిస్తూ.. ఇది తమను భయపెట్టలేదని స్పష్టంచేశారు.

### మహారాష్ట్రలో స్థానిక ఎన్నికలు..

## మైనర్‌తో ఓటేయించిన ఎమ్మెల్యే!

**సోలాపూర్ ఫిబ్రవరి 8 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**




మహారాష్ట్ర జిల్లా పరిషద్, పంచాయతీ ఎన్నికల ఓటింగ్ సందర్భంగా పోలింగ్ బూత్‌ల్లోకి మైనర్లు వెళ్లటం వివాదంగా మారింది. సోలాపూర్, ఛత్రపతి శంభాజీనగర్ జిల్లాలో చోటుచేసుకున్న రెండు వేర్వేరు ఘటనలు తాజాగా వెలుగులోకి వచ్చాయి.ఛత్రపతి శంభాజీనగర్ జిల్లాలో తన కుమారుడితో కలిసి ఓ శివసేన ఎమ్మెల్యే నేరుగా పోలింగ్ బూత్‌లో ఓటు వేసినట్టు వీడియో ఫుటేజ్‌లో కనిపించింది.

## చీనాబ్ నదిపై మెగా ప్రాజెక్ట్ పనులు షురూ!

**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 8 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**



సింధూ నదీ జలాల ఒప్పందాన్ని రద్దు చేసిన తర్వాత, చీనాబ్ నదిపై భారత్ భారీ జల విద్యుత్తు ప్రాజెక్ట్ నిర్మించబోతున్నది. రూ.5,129 కోట్ల విలువైన సావల్‌కోట్ జల విద్యుత్తు ప్రాజెక్ట్ పనులను కేంద్రం ప్రారంభించింది.జమ్ముకశ్మీర్ ఉధంపూర్-రాంబాన్ జిల్లాలో ఈ మెగా ప్రాజెక్ట్‌ను నిర్మించడానికి ఫిబ్రవరి 5న పలు కంపెనీల నుంచి నేషనల్ హైడ్రోఎలక్ట్రిక్ పవర్ కార్పొరేషన్ (ఎన్‌హెచ్‌పీసీ) బిడ్లను ఆహ్వానించింది.

# బిజినెస్

## బంగారం కొనాలనుకునే వారికి గుడ్‌న్యూస్..

### నిలకడగా ధరలు



ఇంటర్‌నెట్ డెస్క్:
వారం క్రితం బంగారం ధరలు గరిష్ఠ స్థాయికి చేరాయి. స్వచ్ఛమైన 24 క్యారెట్ల బంగారం ధర 1,80,000 రూపాయల దగ్గర ట్రేడ్ అయింది. అయితే, ఊహించని విధంగా రెండు రోజులకే బంగారం ధరలు భారీగా పతనం అయ్యాయి. రోజు రోజుకు తగ్గుతూ ఉన్నాయి. ప్రస్తుతం హైదరాబాద్ నగరంలో బంగారం ధరలు ఎలా ఉన్నాయంటే..

బంగారం ధరలు..

గుడ్ రిటర్న్స్ వెబ్‌సైట్ ప్రకారం (ఆదివారం) బంగారం ధరలు పెరగలేదు, తగ్గలేదు. నిలకడగా ఉన్నాయి. ప్రస్తుతం దేశీయ మార్కెట్‌లలో 10 గ్రాముల 24 క్యారెట్ల బంగారం ధర రూ.1,56,600 పలుకుతోంది. అలాగే పది గ్రాముల 22 క్యారెట్ల ధర రూ.1,43,550 దగ్గర ట్రేడ్ అవుతోంది. 10 గ్రాముల 18 క్యారెట్ల బంగారం ధర రూ.1,17,450 వద్ద ట్రేడ్ అవుతోంది.


వెండి ధరలు ఇలా..

బంగారం ధరలలాగే వెండి ధరల్లో కూడా ఎలాంటి మార్పు లేదు. నిన్న కిలో వెండి ధర రూ.2,85,000 వద్ద ట్రేడ్ అయింది. 100 గ్రాముల వెండి ధర రూ.28,500 దగ్గర ట్రేడ్ అయింది. ఈ రోజు కూడా కిలో వెండి ధర రూ.2,85,000 వద్ద ట్రేడ్ అవుతోంది. 100 గ్రాముల వెండి ధర రూ.28,500 దగ్గర ట్రేడ్ అవుతోంది.

## యూపీఐ కొత్త రూల్స్..

### ఈ నెల నుంచే అమలు.. 10 సెకండ్లలోనే పేమెంట్

యూపీఐ సేవల్ని మరింత ప్రోత్సహించేలా కేంద్ర ప్రభుత్వం ఎప్పటికప్పుడు మార్పులు చేస్తూ వస్తోంది. ఈ నెలలో కూడా కొన్ని మార్పులు తీసుకొచ్చింది. ఇప్పటికే కొన్ని సేవలు అందుబాటులోకి రాగా.. మరికొన్ని సేవలు ప్రారంభమవుతాయి. వెరిఫికేషన్ ప్రమాణాలు పెంచుతూ, వినియోగదారులకు మరింత ఉపయోగపడేలా, మరింత పారదర్శకంగా ఈ మార్పులు ఉంటాయి. ఇకపై లావాదేవీలు త్వరగా, సురక్షితంగా పూర్తవుతాయి.కొత్త రూల్ ప్రకారం యూపీఐ లావాదేవీ జరిపినప్పుడు ఏపీఐ (అప్లికేషన్ ప్రోగ్రామింగ్ ఇంటర్‌ఫేస్) వేగంగా స్పందించాలి. అంటే ఒక ట్రాన్సాక్షన్ 10 సెకండ్లలో పూర్తవ్వాలి. ఇంతకుముందు ఈ సమయం 30 సెకండ్లు ఉండేది. త్వరగా ట్రాన్సాక్షన్ పూర్తైతే వినియోగదారులకు చాలా మేలు జరుగుతుంది. పీక్ టైంలో కూడా వెయిట్



చేయాల్సిన అవసరం ఉండదు. యూజర్ల వెరిఫికేషన్ ప్రక్రియ ద్వారా భారీ ట్రాన్సాక్షన్స్ త్వరగా, సురక్షితంగా చేసుకోవచ్చు. పేమెంట్ చేసేముందు స్పష్టమైన అంగీకారం తెలపాలి. అలాగే ఆటో డెడక్షన్స్‌ను కంట్రోల్ చేసుకోవచ్చు. ఇంకా చాలాకాలం నుంచి వాడకుండా ఉన్న యూపీఐ ఐడీలను తాత్కాలికంగా నిలిపివేస్తారు. వీటిని మళ్లీ వాడుకోవాలంటే రీ వెరిఫికేషన్ చేయించుకోవాలి. దీనివల్ల అలాంటి అకౌంట్లు దుర్వినియోగం కాకుండా ఉంటాయి. ఇక చాలా మంది ఎదుర్కొనే సమస్య.. పేమెంట్ ఫెయిల్ అవ్వడం. అంటే యూజర్ల అకౌంట్ నుంచి డబ్బులు కట్ అవుతాయి. కానీ, పేమెంట్ అవ్వదు. ఇలాంటి విషయంలో డబ్బు రీఫండ్ అవ్వాలన్నా.. సమస్య పరిష్కారం కావాలన్నా కొన్నిసార్లు మూడు రోజులు, ఆపై వారం రోజులు కూడా పట్టేది. ఇకపై గంటల్లోనే ఈ సమస్య పరిష్కారం కావాలి. యూపీఐ యాప్స్ లేదా బ్యాంకులు దీనికి బాధ్యత వహించాల్సి ఉంటుంది. వేరే యూజర్ల నుంచి డబ్బు సెండ్ చేయమని అడిగే ప్రక్రియ ఇకపై కఠినతరం కానుంది. యూపీఐ యూజర్లు రిక్వెస్ట్ పంపించే సంఖ్య తగ్గుతుంది.

## భారత్ అమెరికా ట్రేడ్ డీల్..

### ఆ బైకులపై జీరో ట్యాక్స్! ఇక కుర్రాళ్లకు పండగే..

భారత్, అమెరికా మధ్య జరిగిన వాణిజ్య ఒప్పందం ప్రకారం 800 సిసి, 1,600 సిసి మధ్య ఇంజిన్ సామర్థ్యం కలిగిన హార్లే-డేవిడ్సన్ మోటార్ సైకిళ్లపై దిగుమతి సుంకాలను తొలగించాలని భారత్ నిర్ణయించింది. ఈ ఒప్పందం అమెరికన్ లగ్జరీ కార్లపై దిగుమతి సుంకాలను కూడా తగ్గిస్తుంది. అయితే ఎలక్ట్రిక్ వాహనాలపై ఎలాంటి తగ్గింపు ఉండదు.

**హార్లే-డేవిడ్సన్ బైక్‌లపై నో టారిఫ్**

ఈ రాయితీలు ఒప్పందంపై సంతకం చేసిన వెంటనే అమల్లోకి వస్తాయి. ఇది మార్చి నెలలో జరిగే అవకాశం ఉంది. వచ్చే వారం అమెరికా కార్యనిర్వాహక ఉత్తర్వు జారీ చేసిన తర్వాత, భారత ఎగుమతులపై సుంకాలు 18 శాతానికి తగ్గించబడతాయి. ఇతర రాయితీలు, భారతదేశం



నుండి ఏవైనా సంబంధిత తగ్గింపులు వాణిజ్య ఒప్పందం అధికారికంగా సంతకం చేయబడినప్పుడు మాత్రమే అమల్లోకి వస్తాయి. ఇతర అధిక-నాణ్యత గల ICE కార్ల కోసం, 3,000 CC కంటే ఎక్కువ ఇంజిన్ సామర్థ్యం కలిగిన కార్లపై భారతదేశం దిగుమతి సుంకాన్ని 110 శాతం నుండి 30 శాతానికి తగ్గిస్తుంది. ఈ ఒప్పందం కింద దిగువ, మధ్య స్థాయి ఆటోమొబైల్స్‌కు సుంకం రాయితీలు లభించవు. ప్రతిగా ఆటోమొబైల్ విడిభాగాల ఎగుమతుల కోసం భారతదేశం ప్రాధాన్యతా సుంకం-రేటు కోటాను పొందుతుంది. ఈ వాణిజ్య ఒప్పందం వెంటనే అమల్లోకి వచ్చినప్పుడు, కొన్ని భారతీయ ఆటో విడిభాగాలు అమెరికాలో సున్నా రేటుకు లభిస్తాయని, మరికొన్నింటిపై 18 శాతం పన్ను విధించబడుతుందని కేంద్ర వాణిజ్య మంత్రి పియూష్ గోయల్ అన్నారు. భారతదేశం యూరోపియన్ యూనియన్, యునైటెడ్ కింగ్‌డమ్‌తో (ఇండియా యుకె ట్రేడ్ డీల్) కూడా ఇలాంటి నిబంధనలపై ఒప్పందాలు కుదుర్చుకుంది. ఈ ఒప్పందం ప్రకారం యూరోపియన్ లగ్జరీ వాహనాలపై దిగుమతి సుంకాలు క్రమంగా తగ్గుతాయి.

# స్పోర్ట్స్

## అండర్ -19 ప్రపంచకప్ జట్టులో ముగ్గురు భారత కుర్రాళ్లు.. ఓపెనర్‌గా వైభవ్..!

పురుషుల అండర్ -19 వన్డే ప్రపంచకప్ ఫైనల్లో భారీ శతకంతో చెలరేగిన వైభవ్ సూర్యవంశీ కి మరోసారి వార్తల్లో నిలిచాడు. ఇంగ్లండ్ బౌలర్లను ఊచకోత కోసి.. భారత జట్టు ఆరోసారి విజేతగా నిలవడంతో కీలకమైన వైభవ్ టోర్నమెంట్ జట్టుకు ఎంపికయ్యాడు. ఈ మెగా ఈవెంట్‌లో గొప్పగా రాణించిన టీమిండియా కుర్రాళ్లు కనిష్క్ చౌహాన్, పేసర్ హెనిల్ పటేల్ ప్రపంచకప్ జట్టులో చోటు సంపాదించారు. రన్నరప్ ఇంగ్లండ్ టీమ్ నుంచి ముగ్గురిని పదకొండు మంది బృందంలోకి తీసుకున్నారు.ఐసీసీ నిర్వహించే ప్రతి వరల్డ్‌కప్ ముగిశాక తుది జట్టును ప్రకటించడం ఆనవాయితీ. ఈసారి పురుషుల అండర్ -19 ప్రపంచకప్ ముగియడమే ఆలస్యం సంచలన ప్రతిభతో ఆకట్టుకున్న 11 మందితో జట్టును ప్రకటించారు. క్రికెట్ దిగ్గజాలు ఇయాన్ బిషప్, లిడియా గ్రీన్‌వే, ఆండీ ఫ్లవర్, టెల్‌ఫోర్డ్ వైసేలతో కూడిన సెలెక్టర్ల బృందం ఆదివారం టీమ్ ఆఫ్ ది టోర్నమెంట్‌ను వెల్లడించింది. ఇందులో భారత్ నుంచి వైభవ్‌తో పాటు కనిష్క్ చౌహాన్, పేసర్ హెనిల్ పటేల్‌కు చోటు దక్కింది. ఇంగ్లండ్ కెప్టెన్ థామస్ రే వరల్డ్‌కప్ జట్టుకు సారథిగా ఎంపికయ్యాడు. అఫ్గనిస్థాన్ నుంచి ఇద్దరు ఆస్ట్రేలియా, వెస్టిండీస్, పాకిస్థాన్ ఒక్కరు ఈ టీమ్‌లోకి



ఎంపికయ్యారు.

**అండర్ -19 ప్రపంచకప్ టీమ్ ఆఫ్ ది టోర్నమెంట్ :** వైభవ్ సూర్యవంశీ, కనిష్క్ చౌహాన్, హెనిల్ పటేల్(భారత్), థామస్ రే(కెప్టెన్, ఇంగ్లండ్), ఒలివర్ పీకే(ఆస్ట్రేలియా), బేన్ మయెస్(ఇంగ్లండ్), నూరిస్తాని ఒమర్‌జాయ్(అఫ్గనిస్థాన్), విరన్ చముదిత(శ్రీలంక), ఫైజల్ ఖాన్ శిన్వారీ (అఫ్గనిస్థాన్), విటెల్ లవెస్(వెస్టిండీస్), మన్నీ లుమ్స్‌డెన్(ఇంగ్లండ్), అలీ రజా(పాకిస్థాన్).

**సూర్యవంశీ పిడుగల్లే**

జింబాబ్వే వేదికగా జరిగిన పురుషుల అండర్ -19 ప్రపంచకప్‌లో భారత జట్టు విజేతగా నిలిచింది. ఏకపక్షంగా సాగిన ఫైనల్లో వైభవ్ సూర్యవంశీ(175) పిడుగల్లే విరుచుకుపడగా.. కెప్టెన్ ఆయుశ్ మాత్రే(53), అభిగ్యాన్ కుందు(40)లు చెలరేగారు. ఆఖర్లో కనిష్క్ చౌహాన్(37 నాటౌట్) మెరుపులతో 411 రన్స్ కొట్టిన టీమిండియా.. అనంతరం ప్రత్యర్థిని 311కే కట్టడి చేసింది. అంబ్రిష్(3-56), కనిష్క్(2-63), దీపేశ్(2-64) అద్భుతమైన బౌలింగ్‌తో ఇంగ్లండ్ ఆశలపై నీళ్లు చల్లారు. వంద పరుగుల తేడాతో నెగ్గిన భారత్.. రికార్డు స్థాయిలో ఆరోసారి ట్రోఫీని అందుకుంది.

## ప్రమాదంలో రోహిత్, విరాట్ భారీ రికార్డ్.. సరికొత్త చరిత్రకు సిద్ధమైన దిగ్గజ ప్లేయర్

టీ20 ప్రపంచ కప్ 2026లో ఐదవ మ్యాచ్ నేపాల్ వర్సెస్ ఇంగ్లాండ్ జట్ల మధ్య జరిగింది. ఉత్కంఠగా సాగిన ఈ మ్యాచ్ లో ఇంగ్లాండ్ టీం 4 పరుగుల తేడాతో విజయం సాధించింది. ఈ మ్యాచ్ చివరి బంతి వరకు కొనసాగింది. అయితే, ఈ మ్యాచ్ లో ఇంగ్లాండ్ స్టార్ బ్యాటర్ జోస్ బట్లర్ తన పేరిట కొత్త రికార్డ్ లిఖించుకున్నాడు.నేపాల్‌తో జరిగిన ఈ మ్యాచ్‌లో జోస్ బట్లర్ 17 బంతుల్లో 26 పరుగులు మాత్రమే చేశాడు. ఈ ఇన్నింగ్స్‌లో 5 ఫోర్లు ఉన్నాయి. దీంతో టీ20 ప్రపంచ కప్‌లో అత్యధిక పరుగులు చేసిన ఆటగాడిగా శ్రీలంక మాజీ క్రికెట్ లెజెండ్ మహేల జయవర్ధనేను అధిగమించాడు.మహేల జయవర్ధనే తన కెరీర్‌లో మొత్తంలో 31 టీ20 ప్రపంచ



కప్ మ్యాచ్‌లు ఆడి 1016 పరుగులు చేశాడు. జోస్ బట్లర్ ఇప్పుడు 36 మ్యాచ్‌ల్లో 1039 పరుగులు చేసి, మూడో స్థానానికి చేరాడు. ఈ జాబితాలో భారత దిగ్గజాలు విరాట్ కోహ్లీ, రోహిత్ శర్మ ముందున్నారు.విరాట్ కోహ్లీ 35 మ్యాచ్‌ల్లో 1,292 పరుగులతో అగ్రస్థానంలో ఉన్నాడు. రోహిత్ శర్మ 47 టీ20 ప్రపంచ కప్ మ్యాచ్‌ల్లో 1,220 పరుగులు చేశాడు. అయితే, ఈ ఇద్దరు ఆటగాళ్లు టీ20 క్రికెట్ నుంచి రిటైర్ అయ్యారు. అందువల్ల, జోస్ బట్లర్ అగ్రస్థానానికి చేరుకునే అవకాశం చాలా ఎక్కువ.రాబోయే మ్యాచ్‌లలో జోస్ బట్లర్ 234 పరుగులు చేస్తే, అతను రోహిత్ శర్మను అధిగమించి టాప్ 2లో చేరుతాడు. అయితే, విరాట్ కోహ్లీని అధిగమించాలంటే, అతను 254 పరుగులు చేయాల్సి ఉంది. అది బట్లర్‌కు అంత సులభం కాదు.

## ప్రపంచకప్ తొలి మ్యాచ్‌లో అఫ్గాన్‌పై నెగ్గిన న్యూజిలాండ్




: టీ20 ప్రపంచకప్‌ను న్యూజిలాండ్ జట్టు విజయంతో ప్రారంభించింది. ఇవాళ అఫ్గాన్‌తో జరిగిన మ్యాచ్‌లో 5 వికెట్ల తేడాతో నెగ్గింది. 183 పరుగుల లక్ష్యంతో బ్యాటింగ్‌కు దిగిన న్యూజిలాండ్ 17.5 ఓవర్లలో 5 వికెట్లు కోల్పోయి ఛేదించింది. న్యూజిలాండ్ బ్యాటర్లలో టిమ్ సీఫెర్ట్ (65) అర్ధశతకం చేయగా.. గ్లెన్ ఫిలిప్స్ (42), మార్క్ చాప్‌మన్ (28), డారిల్ మిచెల్ (25 నాటౌట్) రాణించారు.అఫ్గానిస్థాన్ బౌలర్లలో ముజీబ్ రెహమాన్ 2, ఒమర్జాయ్, రషీద్ ఖాన్, మహమ్మద్ నబీ ఒక్కో వికెట్ తీశారు. అంతకుముందు టాస్ గెలిచి తొలుత బ్యాటింగ్ చేసిన అఫ్గానిస్థాన్ నిర్ణీత 20 ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 182 పరుగులు చేసింది. గుల్బాదిన్ నబీ (63) అర్ధశతకం బాదాడు. సెదిఖుల్లా అటల్ (29), రెహమానుల్లా గుర్బాజ్ (27), దార్విష్ రసూలీ (20) తమ వంతు ప్రయత్నం చేశారు. మూడో వికెట్‌కు అటల్, గుల్బాదీన్ కలిసి 79 పరుగుల భాగస్వామ్యం నెలకొల్పారు. చివర్లో ఒమర్జాయ్ (14) రనౌటయ్యాడు. న్యూజిలాండ్ బౌలర్లలో ఫెర్గూసన్ 2 వికెట్లు తీయగా.. హెన్రీ, డఫీ, రచిన్ రవీంద్ర తలో వికెట్ దక్కించుకున్నారు.